



WORLD SAREE DAY

శారీలేరు నీకెవ్వరూ..

6వ పేజీలో

భారతీయ సంస్కృతికీ, కళాత్మకతకూ చిహ్నం చీర. స్త్రీ నిండుదనానికి అద్దంపట్టే వస్త్రధారణ ఇది. చీరదేముంది.. ఒంటికి చుట్టేసుకోవడమే కదా అనుకుంటారు గానీ ప్రాంతానికో తీరుగా ఉండే చీరకట్టు ఆ ప్రాంతపు అస్తిత్వాన్ని పట్టి చూపుతుంది.. మిడ్డీలూ, అరచెడ్డీలూ, చింపుడు ప్యాంట్లూ, నిలువు గౌన్లూ.. ఇలా పడమటి గాలి ఎన్ని ఫ్యాషన్లు మోసుకొచ్చినా.. మన చీర మాత్రం చెక్కుచెదరని అందానికి ప్రతీకగా నిలిచే ఉంది. అందుకే చీరకీ ఏడాదికో పండుగదినాన్ని నిర్ణయించారు. అది ఈరోజే! దేశ ఫ్యాషన్ పటంపై ఎగురుతున్న మనజిల్లా చీరల విశేషాలు..

చిత్తూరు ఆస్పత్రికి తాజా అభివృద్ధి కమిటీ ఏర్పాటు

చిత్తూరు సిటీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి అభివృద్ధి నూతన కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా కలెక్టర్ సుమిత్ కుమార్, కో-చైర్మన్‌గా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, సభ్యులుగా ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, జి.సురేష్ (సోషియల్ మొబలైజేషన్), విజయ కుమార్ (సోషియల్ సర్వీస్), మెంబర్ కన్వీనర్‌గా డాక్టర్ అరుణ్ కుమార్ (మెడికల్ సూపరింటెండెంట్), సభ్యులుగా ప్రభావతి దేవి (డీఎంహెచ్‌వో), వరలక్ష్మిబాయ్ (నర్సింగ్ సూపరింటెండెంట్), నరసింహప్రసాద్ (మున్సిపల్ కమిషనర్), కె.మునిజయకుమార్ (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్), అరుణకుమారి (జిల్లా సమాఖ్య సెక్రటరి), రమేష్ దీన (డోనర్), ప్రభావతి (డీసీహెచ్‌ఎస్), డాక్టర్ విజయకుమార్ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) నియమితులయ్యారు.

బాబోయ్ జ్వరాలు

- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు



చిత్తూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామాలతో పాటు పట్టణాల్లోనూ వ్యాధిగ్రస్తులు పెరుగుతుండడంతో ఆస్పత్రులన్నీ జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి. ఈ ఏడాది అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటి వరకు 302 డెంగ్యూ ,19 చికున్‌గున్యా, 2 మలేరియా కేసులు నమోదయ్యాయి. వాస్తవానికి మరిన్ని కేసులు ప్రైవేటు వైద్యశాలల్లో నమోదయ్యాయి. వర్షాకాలానికి ముందే సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్య శాఖ అన్ని కేటగిరీల సిబ్బందికి శిక్షణ ఇచ్చింది. కానీ ఆ సమావేశాల్లో సూచించిన విషయాలేవీ క్షేత్రస్థాయిలో అమలు చేయకపోవడం వల్లే జ్వరాల తీవ్రత ఎక్కువైందన్న విమర్శలున్నాయి.


- చిత్తూరు రూరల్, ఆంధ్రజ్యోతి

పర్యవేక్షణ లేకనే...

వ్యాధుల నివారణకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎపిడమిక్, మలేరియా నివారణ విభాగంలోని సూపర్‌వైజర్లు తరచూ ప్రైవేటు ఆస్పత్రులను పరిశీలించాలి. అక్కడ నమోదవుతున్న డెంగ్యూ, మలేరియా, మెదడువాపు కేసుల వివరాలను పరిశీలించాలి.అయితే ఈ పని సరిగా జరగలేదు. అదే సమయంలో ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదవుతున్న కేసుల వివరాలపై యాజమాన్యాలు వైద్యశాఖకు సమాచారం ఇవ్వట్లేదు.డీఎంహెచ్‌వో కార్యాలయంలోని మాస్ మీడియా విభాగం(డెమో సెక్షన్) ప్రజలు జ్వరాలబారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలి. అదీ అంతంత మాత్రంగానే జరిగింది.

- ఐదేళ్లుగా జిల్లాలో నమోదైన డెంగ్యూ, మలేరియా కేసులు

సంవత్సరం	డెంగ్యూ	మలేరియా
2019	327	8
2020	25	3
2021	213	4
2022	179	2
2023	235	2
2024(డిసెంబరు 19వరకు)	302	2



ఆస్పత్రుల్లో ఖర్చు తడిసిమోపెడు....

చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో గత వారం రోజుల్లో ఏడుగురికి డెంగ్యూ జ్వరం నిర్ధారణ అయింది.డెంగ్యూ జ్వరానికి సకాలంలో వైద్యం చేయించుకుంటే ప్రమాదం ఉండదు. రోగి శరీరంలో ప్లేట్‌లెట్స్ హెచ్చుతగ్గులు కావడం సహజం. మరీ తగ్గితే తప్ప ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సిన అవసరం ఉండదు. దీనిపై అవగాహన లేక ఎంతోమంది భయంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరుతున్నారు. అక్కడ రక్తపరీక్షలు, బెడ్ ఛార్జీలు, మందులు అంతా కలిపి రూ.20 నుంచి 30 వేలు ఖర్చువుతుండడంతో ప్రజలకు భారంగా మారింది.

ఆస్పత్రులకు పెరుగుతున్న ఓపీలు

చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రితో పాటు పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా, ప్రైవేటు ఆస్పత్రులన్నీ కొద్దిరోజులుగా రోగులతో కిటకిటలాడుతున్నాయి. గతంలో చిత్తూరు ఆసుపత్రిలో రోజూ వెయ్యిమంది ఓపీకి వస్తుంటే ప్రస్తుతం ఆ సంఖ్య 1500కు చేరుకుంది.ఈ వారం రోజుల్లో 10157 మంది ఓపీకి వచ్చినట్లు గణంకాలున్నాయి. అందులో కూడా జ్వరంతో వచ్చే వారి సంఖ్య సగానికంటే అధికంగానే వుంటోంది. దీంతో ఉదయం నుంచే ఓపీ విభాగం కిక్కిరిసిపోతోంది.ఇక జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు రోగులు క్యూ కడుతున్నారు. పలమనేరు ప్రభుత్వాస్పత్రికి ఈ వారం రోజులుగా జ్వరాలతో వస్తున్నవారికి రక్తపరీక్షలు నిర్వహించగా 17మందికి టైఫాయిడ్ జ్వరం వచ్చినట్లు గుర్తించారు. పుంగనూరు ఏరియా ఆస్పత్రికి రోజూ 400 మంది వస్తుండగా వారిలో పదమంది వైరల్ ఫీవర్ బాధితులే వస్తున్నారు.ఈ వారం రోజుల్లో 2885మందికి రక్త పరీక్షలు చేయగా రెండు డెంగ్యూ కేసులు నిర్ధారణ అయ్యాయి.నగరి ఏరియా వైద్యశాలలో వారం రోజుల్లో 122 మంది ఓపీలో జ్వరాల కోసం చికిత్స తీసుకున్నారు. 20 మందికి డెంగ్యూ, 60 మందికి మలేరియా పరీక్షలు నిర్వహించగా నిర్ధారణ కాలేదు. 90 మందికి టైఫాయిడ్ పరీక్షలు చేయగా.. 30 మందికి పాజిటివ్ వచ్చింది.




చిత్తూరు ఆస్పత్రిలో మందుల కోసం రోగుల క్యూ

దోమల వల్లే...

ఇటీవల తరచూ వర్షాలు పడుతుండడం, పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో దోమల వ్యాప్తి పెరిగిపోయింది.సాధారణంగా వర్షాలు పడగానే డెంగీ దోమ బెడద మొదలవుతుంది. చిత్తడి వాతావరణం, అపరిశుభ్ర వాతావరణమే దీని వుధ్రుతికి కారణమవుతోంది. సూర్యోదయ, సూర్యాస్తమయ వేళల్లో చురుగ్గా ఉండే టైగర్ దోమ కుడితే... డెంగీ వైరస్ ఒంట్లో ప్రవేశిస్తుంది. డెంగ్యూ నిర్ధారణకు ప్రైవేటు ఆస్పత్రుల్లో ర్యాపిడ్ టెస్టులు చేస్తుండగా.. ప్రభుత్వ వైద్యశాలలైన చిత్తూరు, కుప్పం, పలమనేరు, నగరిలో మాత్రమే ప్రభుత్వం ఎలిసా పరీక్షలు నిర్వహిస్తోంది. ర్యాపిడ్ టెస్ట్‌లో కచ్చితత్వం ఉండడం లేదన్న కారణంతో... మూడేళ్ల కిందట ఆ పరీక్ష చేయవద్దని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఎలిసా టెస్టులు చేసి డెంగ్యూ నిర్ధారణ అయిన కేసులనే ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటోంది.

పాడుపడ్డ భవనంలోనే...



చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పాడుపడ్డ భవనంలోనే ఇన్‌పేషెంట్ వార్డును నిర్వహిస్తున్నారు. సుమారు 50 ఏళ్లకు ముందు నిర్మించిన భవనం కావడంతో కూలిపోయే స్థితికి చేరుకుంటోన్న భవనంలో వార్డుల నిర్వహణపై రోగులు భయాందోళనకు గురవుతున్నారు.పారిశుధ్య నిర్వహణను గాలికి వదిలేశారు. సెప్టిక్ ట్యాంకు నిండి బయటకు పొంగి వార్డులోకి దుర్వాసన వస్తోంది. కిటికీలకు దోమతెరలు కూడా లేక దోమలు విజృంభిస్తున్నాయి. అలాగే ఓపీ నిర్వహించే వార్డులో తాగునీరు లేక రోగులు ఇబ్బందిపడుతున్నారు.



వానగుట్టపల్లెలో మహిళలతో ముఖాముఖి - చిన్నారితో

అభివృద్ధికి హామీ.. మహిళలకు ధైర్యం !

- రెండవ రోజూ భువనేశ్వరి విస్తృత పర్యటన





ప్రత్యంగిరాదేవికి వెండి కిరీటం సమర్పిస్తూ

కుప్పం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి రెండవ రోజున కుప్పం మండలం వానగుట్టపల్లె, గుండ్లమడుగు, అడవిబూదుగూరు, కుప్పం మున్సిపాలిటీ డీకేపల్లెల్లో విస్తృతంగా పర్యటించారు. కుప్పం అభివృద్ధికి హామీ ఇస్తూ, మహిళలకు ధైర్యం చెబుతూ ఆమె పర్యటన సాగింది.మహిళలు కూడా సొంత కుటుంబంలోని వ్యక్తిలాగా చాలా చనువుగా తమ సమస్యల గురించి ప్రస్తావించి పరిష్కారాలు కోరారు.గత ప్రభుత్వ హయాంలో సాగిన అరాచకాలు, అభివృద్ధి లేమిపై విమర్శనాస్త్రాలు సంధించిన భువనేశ్వరి చంద్రబాబు అంతకంతకంత అభివృద్ధి చేస్తారని ప్రజలకు నమ్మకం కలిగించగలిగారు. శుక్రవారం ఉదయం పీఈఎస్ గెస్ట్ హౌస్ వద్ద ప్రజలనుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించిన అనంతరం అక్కడినుంచి బయలుదేరి కుప్పం మండలం వానగుట్లపల్లె చేరుకున్నారు. ఇక్కడ ఉదయం 11.30 గంటలకు మహిళలతో ముఖాముఖిలో భువనేశ్వరి పాల్గొన్నారు. చంద్రబాబు తరఫున కుప్పం అభివృద్ధికి భరోసా ఇచ్చారు. ఎన్టీఆర్ ట్రస్టు తరఫున సేవలను వివరించారు. గత ప్రభుత్వ హయాంలో అరాచకాలు జరిగాయని, ప్రజలను విధ్వంసం పాలు చేసి వారి జేబులు నింపుకున్నారని విమర్శలు చేశారు. అక్కడి నుంచి అడవిబూదుగూరు, కుప్పం మున్సిపాలిటీ డీకేపల్లెలో జరిగిన సభల్లో మహిళలతో ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వారితో కూడా అభివృద్ధి గురించే చర్చించారు. వారు చెప్పిన సమస్యలు సావధానంగా విన్నారు. అర్జీలు స్వీకరించారు. సమస్యలన్నీ చంద్రబాబుకు చెప్పి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఎన్టీఆర్ ట్రస్టు తరఫున చేస్తున్న ఉచిత శిక్షణ, ఇతర సేవా కార్యక్రమాల గురించి వివరించారు. వాటిని వినియోగించుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని మహిళలకు పిలుపునిచ్చారు. మధ్యలో ప్రత్యంగరాదేవి దేవస్థానానికి వెళ్లి పూజలు చేసి, దేవికి వెండి కిరీటం బహూకరించారు. డీకేపల్లెలో సభ ముగిసేసరికి రాత్రి 7 గంటల సమయమైంది. ఆమె నేరుగా అక్కడి నుంచి కుప్పం పీఈఎస్ వైద్య కళాశాల వసతి గృహం చేరుకుని అక్కడ బస చేశారు.విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, నాయకులు డాక్టర్ సురేశ్‌బాబు, ప్రేమ్‌కుమార్ వంటివారితోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు తప్ప వేరేవాళ్లు ఎవ్వరూ వేదికలు పంచుకోలేదు. కంచర్ల తప్ప మరెవరూ ప్రసంగాలు చేయలేదు. ఆయన ప్రసంగం కూడా చాలా క్లుప్తంగా ముగిసింది. దీంతో భువనేశ్వరి ఎటువంటి ఆటంకం లేకుండా పూర్తిస్థాయిలో తాను చెప్పదలచుకుంది ప్రజలకు చెప్పగలిగారు. వారి సమస్యలు సావధానంగా విన్నారు. ప్రతి మూడు నెలలకోసారి కుప్పం వచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, చంద్రబాబు తరఫున తాను కుప్పం బాధ్యతలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

నేటి పర్యటన

9 ఏఎం - 10 ఏఎం : ప్రజలనుంచి విన్నపాల స్వీకరణ

10.30 ఏఎం - 12 పీఎం : రామకుప్పం మండలం మొద్దులవంకలో మహిళలతో ముఖాముఖి

12.45 పీఎం - 02.00 పీఎం : గాంధీనగరంలో మహిళలతో ముఖాముఖి

2.45 పీఎం - 4.30 పీఎం : శాంతిపురంలో డ్వాక్రా మహిళలతో ముఖాముఖి

4.45 పీఎం - 6 పీఎం : మొరసనపల్లెలో మహిళలతో ముఖాముఖి



ఆటోను ఢీకొని రోడ్డుపై పడి ఉన్న హర్ష, సాయితేజ

ఆటోను ఢీకొన్న బైక్ ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థుల దుర్మరణం

- హెల్మెట్లు ధరించకపోవడం వల్లే అన్న డీఎస్పీ సాయినాథ్

తవణంపల్లె, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తూ ఆటోను ఢీకొని ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు దుర్మరణంపాలైన సంఘటన శుక్రవారం తవణంపల్లె మండలంలో జరిగింది. ఎస్‌ఐ చిరంజీవి కథనం మేరకు .... మైనగుండ్లపల్లెకు చెందిన హర్ష(18), ముత్తరపల్లెకు చెందిన సాయితేజ(18) చిత్తూరు సీతమ్స్ కాలేజీలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. శుక్రవారం ఉదయం హర్షతో కలిసి సాయితేజ మోటర్ సైకిల్‌పై కాలేజీకి వెళతూ సత్తారు బావి సమీపంలో ముందు వెళుతున్న బస్సును ఓవర్ టేక్ చేస్తూ అదుపుతప్పి కాణిపాకం వైపు వస్తున్న ఆటోను వేగంగా ఢీకొన్నారు. దీంతో రోడ్డుపై పడడంతో ఇద్దరి తలలకు బలమైన గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం చిత్తూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు.హర్ష తండ్రి ప్రసాద్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.సంఘటనా స్థలాన్ని శుక్రవారం ఉదయం చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ పరిశీలించారు. మృతులు హర్ష, సాయితేజ హెల్మెట్ ధరించకపోవడం వలనే తలకు బలమైన గాయాలై దుర్మరణం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు.

చిత్తూరు పరిసరాల్లో 10 నుంచి 20శాతం

- భూవిలువలపై అధికారుల పెంపు ప్రతిపాదనలు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భూముల మార్కెట్ విలువల పెంపుపై గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో జేసీ విద్యాధరి అధ్యక్షతన జిల్లా మార్కెట్ వాల్యూ రివిజన్ కమిటీ సమావేశం జరిగింది. ఎక్కడెక్కడ ఏ మేరకు విలువలు పెంచాలనే విషయమై సమావేశంలో చర్చించారు. జిల్లావ్యాప్తంగా 10 నుంచి 15 శాతం మేర భూవిలువలు పెంచుతూ ప్రతిపాదనలు తయారుచేయాలని అధికారులను జేసీ ఆదేశించారు. అన్నిచోట్ల పూరిల్లు, గుడిసెలకు చ.గ. ధర గతంలో రూ.400 ఉండగా, ప్రస్తుతం రూ.420గా ప్రతిపాదించారు. కొన్ని మండలాల్లో నివాస స్థలాలకు చదరపు గజం ధర రూ. 1500 నుంచి రూ. 1620కి పెంచనున్నారు.

వాణిజ్య భూవిలువల సవరణ వివరాలు....

చిత్తూరులో ప్రధానకూడలి అయిన ప్రకాశం హైరోడ్డులో చదరపుగజం ధర రూ.46,950 ఉండగా,ప్రస్తుతం రూ.51,645కి పెంచేందుకు ప్రతిపాదించారు. పాత తాలుకా వీధిలో చ.గ. ధర రూ.45,100 ఉండగా, రూ.49,600కి, పొన్నియమ్మ గుడివీధిలో చ.గ. ధర రూ.36,100 ఉండగా, రూ.39,700కి, డీ.ఐ. రోడ్డులో చ.గ. ధర రూ.18,060 ఉండగా, ప్రస్తుతం రూ.19,900కి, నాయుడు బిల్డింగ్స్‌లో చ.గ. ధర రూ.16,260 ఉండగా, రూ.17,900కి, కట్టమంచి మార్కెట్ యార్డు వీధి, తిరుత్తణి రోడ్డులో చ.గ. ధర రూ.12,650 ఉండగా,రూ.13,900కి పెంచుతూ ప్రతిపాదనలు సిద్ధం చేశారు.గిరింపేట వేలూరురోడ్డులో చ.గ. ధర రూ.14,000 ఉండగా, రూ.15,400కి, రెసిడెన్షియల్ ఏరియాకు చ.గ. ధర రూ.8,700 ఉండగా,రూ.9,600కి, కట్టమంచిలో రెసిడెన్షియల్ ఏరియాలో చ.గ. ధర రూ.5,450 ఉండగా,రూ.6,000కి పెంచనున్నారు. చిత్తూరు రూరల్, గుడిపాల, యాదమరి మండలాల్లోని పంచాయతీల్లో చ.గ. ధర రూ.1500 ఉండగా, ప్రస్తుతం రూ.1600గా ప్రతిపాదించారు.మండల హెడ్‌క్వార్టర్స్‌లో భూవిలువలను దాదాపు 15శాతం పెంచనున్నారు.గంగాధరనెల్లూరు, తవణంపల్లి, ఐరాల, పెనుమూరు, పూతలపట్టు, పాలసముద్రం, చిత్తూరు మండలం పార్ట్ (గాండ్లపల్లి) పరిధిలో వచ్చే 79 గ్రామాల్లో సరాసరి 10 నుంచి 20 శాతం పెంచనున్నారు.కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయ పరిసరాల్లో చ.గ. ధర రూ.2,000 ఉండగా, ప్రస్తుతం రూ.2,400గా, కొత్తపల్లి, చిగరపల్లి గ్రామాల్లో చ.గ. ధర రూ.500 ఉండగా, ప్రస్తుతం రూ.600కి, పుత్రమద్ది, ముదిగోళం గ్రామాల్లో చ.గ. ధర గతంలో రూ.470 ఉండగా, ప్రస్తుతం రూ.570కి, కామినాయనపల్లి, సంగనపల్లిలో చ.గ. ధర గతంలో రూ.310 ఉండగా, ప్రస్తుతం రూ.500కి పెంచుతూ ప్రతిపాదనలు సిద్ధంచేశారు. కాణిపాక ఆలయ పరిసరాల్లో అపార్ట్‌మెంట్లకు (కాంపోజిట్ వాల్యూ) చ.అ. ధర గతంలో రూ.1300 ఉండగా, ప్రస్తుతం రూ.1390కి, స్ట్రక్చర్స్ నిర్మాణాలకు (ఆర్‌సీసీ, మోల్డింగ్) చ.అ. ధర గతంలో రూ.1400 ఉండగా, ప్రస్తుతం రూ.1490కి పెంచుతూ ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

ఎకరా విలువలు ఇలా...

మెట్ట, మాగాణి, గార్డెన్, జాతీయ రహదారి పక్కనున్న భూములు, హౌస్‌సైట్లకు అనువైన వ్యవసాయ భూముల విలువలు కూడా పెంచుతూ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. చిత్తూరు రూరల్ మండలం దిగువమాసాపల్లిలో ఎకరా ధర గతంలో నంజ భూమి విలువ రూ.3.33లక్షలు ఉండగా, ప్రస్తుతం రూ3.83 లక్షలకు, ఎకరా పుంజ ధర రూ.2.98 లక్షలు ఉండగా, ప్రస్తుతం రూ.3.43 లక్షలకు, గార్డెన్ భూమి విలువ (ఎకరా) అప్పట్లో రూ.3.21లక్షల నుంచి ప్రస్తుతం రూ.3.70లక్షలకు, జాతీయ రహదారి పక్కనున్న భూములకు ఎకరా రూ.7.20 లక్షల నుంచి రూ.8.28 లక్షలకు పెంచుతూ ప్రతిపాదించారు. యాదమరి మండలం పెరియంబాడిలో హౌస్‌సైట్ల నిర్మాణాలకు వెంచర్లకోసం వ్యవసాయ భూములకు ఎకరా ధర రూ.2.95 లక్షల నుంచి రూ.3.39 లక్షలకు, జంగాలపల్లెలో రూ. 3.37 లక్షల నుంచి రూ. 3.88 లక్షలకు, యాదమరి మండల కేంద్రంలో రూ. 4.60 లక్షల నుంచి రూ. 5.20లక్షలకు పెంచుతూ ప్రతిపాదించారు.

కిక్కిరిసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు




తిరుపతి, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం నుంచి భూములు, ఆస్తుల విలువలు పెరగనున్న నేపథ్యంలో జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయాలు క్రయ, విక్రయదారులతో కిక్కిరిసిపోతున్నాయి. జనవరి 1నుంచి ఆస్తుల విలువను పెంచేందుకు ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. దీంతో డిసెంబరు నెలలోపు రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఈక్రమంలో శుక్రవారం తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొనుగోలుదారులు క్యూకట్టారు. ఒకదశలో సబ్ రిజిస్ట్రార్లకు ఊపిరితీసుకునే సమయం కూడా లేకపోవడంతో కొనుగోలుదారులకు మధ్య వాగ్వివాదం చోటుచేసున్నాయి. శ్రీబాలాజీ జిల్లాలో భూ విలువల పెంపుపై తిరుపతి అర్బన్ మార్కెట్ వాల్యూ రివిజన్ కమిటీ ఇప్పటికే సమావేశమైంది. మరో వారంలో జేసీ శుభం భన్సల్ అధ్యక్షతన కమిటీ సమావేశం కానుంది. రిజిస్ట్రేషన్ విభాగం ప్రతిపాదించిన ధరలను కమిటీ అంగీకారంతో పాటు ప్రజల నుంచి పెద్దఎత్తున అభ్యంతరాలు లేకపోతే కొత్త సంవత్సరంలో కొత్త ధరలు అందుబాటులోకి వస్తాయి.

అంబేడ్కర్ గురుకులాల్లో మరమ్మతులకు రూ.90 లక్షలు

తిరుపతి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరంలో నిర్వహణ గ్రాంటు కింద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో మరమ్మతులు చేపట్టేందుకు తిరుపతి, చిత్తూరు జిల్లాలకు ప్రభుత్వం రూ.90 లక్షలు మంజూరు చేసింది. పుత్తూరు గురుకులంలో తలుపులు, కిటికీల మరమ్మతులకు రూ.10 లక్షలు, చిల్లకూరు, వాకాడులో మరుగుదొడ్లు, మురుగునీటి కాలువల మరమ్మతులకు రూ.పదేసి లక్షల వంతున రూ.20 లక్షలు, నాయుడుపేటలో డార్మిటరీ రెండవ బ్లాక్, బ్లాక్ టూ తరగతి గది మరమ్మతులకు రూ.10 లక్షలు.. మొత్తం రూ. 40 లక్షలు మంజూరైంది. చిత్తూరు జిల్లాలో కుప్పం, చిత్తూరు, విజయపురం గురుకులాలకు రూ. 10 లక్షలు వంతున, రామకుప్పం గురుకులానికి రూ. 15 లక్షలు, పూతలపట్టు గురుకులానికి రూ.5 లక్షలు చొప్పున 50 లక్షలు మంజూరైంది.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని 19 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1 లో 4కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.60 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,165

తలనీలాలు సమర్పించినవారు: 20,377

WORLD SAREE DAY



చీర.. భారతీయ సంప్రదాయ చిహ్నమే కాదు. ట్రెండీ కూడా. అందుకే ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడు ఆడవాళ్లు చీరల మీద మోజు పడుతున్నారు. మనదేశంలో ప్రాంతాన్ని బట్టీ చీర కట్టులో తేడాలుంటాయి. తాజాగా తొడుక్కునే చీరలు మార్కెట్‌లో కనిపిస్తున్నాయి. ఏ పెళ్లిలో అయినా చీరల తళుకులే ప్రత్యేక ఆకర్షణ. చీరంటే ఇప్పుడు.. ఒంటికి చుట్టుకునే వస్త్రం ఎంత మాత్రం కాదు. అందాన్ని పెంచే ఫ్యాషన్! అందుకే చీరలకూ ఒక ప్రత్యేక పండుగ దినాన్ని నిర్ణయించారు. దేశంలో ట్రెండీగా ఉన్న లేటెస్ట్ డిజైన్డ్ చీరలకు తిరుపతి జిల్లా కేంద్రంగా ఉంది. వెంకటగిరి కాటన్, నారాయణవనం పట్టు, కాళహస్తి కలంకారీ, మన్నారుపోలూరు సరిగ చీరలు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, ముంబై నగరాల్లో రెపరెపలాడుతున్నాయి. ఒకప్పుడు సంప్రదాయ చీరలకే పరిమితమైన ఈ ప్రాంతాలు మారుతున్న అభిరుచులకు అనుగుణంగా డిజైన్లు మార్చుకున్నాయి. తిరుపతి నగరంలో అయితే మగ్గం వర్క్ చీరలు హల్‌చల్ చేస్తున్నాయి.

..మన కోక!

రాణులు మెచ్చిన వెంకటగిరి చీర

ఒకప్పుడు రాణులకే పరిమితమైన వెంకటగిరి చీర ఇప్పుడు పేదలకూ అందుబాటులోకి వచ్చింది. నూరవ నెంబరు స్వచ్ఛమైన కాటన్ నూలుతో నేసే ఈ చీరకే దేశ విదేశాల్లో పేరుంది. క్రీ.శ. 1700 నుంచీ వెంకటగిరి చీర ప్రస్తావన పలు చోట్ల కనిపిస్తుంది. వెంకటగిరిని ఏలిన వెలుగోటి వంశస్తులు ఇక్కడి చేనేతను ప్రోత్సహించారు. పిఠాపురం, బొబ్బిలి ఆస్థానాలకు కూడా వెంకటగిరి చేనేత చీరలు వెళ్లేవి. వెంకటగిరి చీరకు 1999లో జీఐ గుర్తింపు కూడా లభించింది. నీతూ అంబానీ, ప్రసిద్ధ సినీతారలు మెచ్చే చీరలుగా వీటికి గుర్తింపు లభించింది. మేలైన నూలుతో నేసే చీరలు కావడం వల్ల వయసు మీరిన వారికి కూడా కట్టుకుంటే తేలికగా ఉండడం వెంకటగిరి చీరల ప్రత్యేకత. నిరంతరం కొత్త డిజైన్లు ఇక్కడ తయారవుతుంటాయి. ఆధునిక సాంకేతికత ఇందుకు ఉపయోగపడుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో వెంకటగిరి చీరలకు మంచి గిరాకీ ఉంది. ఏటా పదివేలకు పైగా చీరలు వెంకటగిరి మగ్గాల నుంచి తయారవుతున్నాయి. విభిన్నమైన డిజైన్‌లతో చీరలు నేసిన 11 మంది వెంకటగిరి నేత కళాకారులకు రాష్ట్రపతి అవార్డులు లభించడం విశేషం.

-వెంకటగిరిటౌన్, ఆంధ్రజ్యోతి

లేటెస్ట్ ట్రెండ్

- జాందాని వర్క్ చీరలు. చీరంతా డిజైన్ ఉండే వీటిని నేయడానికి వారంనుంచి నెల రోజులు కూడా పడుతుంది. వీటి ధరలు రూ. రెండు వేల నుంచి రెండు లక్షల దాకా ఉంటాయి.
- పూర్తి కాటన్ చీరలు రూ. 500 నుంచీ కూడా ఇక్కడ లభిస్తాయి.







నారాయణవనం పట్టు స్టయిలే వేరు

చీరల్లోనూ పట్టుచీరల మీద ఉండే మోజు వేరే! అందుకే నారాయణవనం పట్టుచీరలకు అంత డిమాండ్. సింగిల్ త్రెడ్, డబుల్ త్రెడ్, వెండి జరీ, బంగారు జరీ చీరలను ఇక్కడ నేస్తారు.ఒకప్పుడు పూర్తిగా చేనేత చీరలే ఉండేవి. కాలక్రమంలో మరమగ్గాల మీద నేయడం మొదలు పెట్టారు. లతలూ పూలే కాకుండా దేవతా ప్రతిమల చిత్రాలతో కూడిన చీరలు నేయడం నారాయణవనం ప్రత్యేకత. ఈ చీరలు తక్కువ బరువు ఉండడంతో ఎక్కువ మంది ఇష్టపడుతారు. ఇప్పటికీ 50 కుటుంబాలు వారసత్వంగా నారాయణవనంలో చీరల నేతనే వృత్తిగా కొనసాగించడం విశేషం. చెన్నై, బెంగులూరు, కంచిలకు నారాయణవనం చీరలు పంపుతారు.

- నారాయణవనం, ఆంధ్రజ్యోతి

లేటెస్ట్ ట్రెండ్

- ఇమిటేట్ పట్టు మీద పోస్టర్ డిజైన్ చీరలను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. చీరంతా డిజైన్ నిండి ఉండడం వీటి ప్రత్యేకత. వీటి ధరలు రూ. 5 వేల నుంచి 60 వేల దాకా ఉన్నాయి.
- నారాయణవనంలో నేసే ఇతర చీరలు డిజైన్‌ను బట్టీ రూ. 7500 నుంచి రెండు లక్షల దాకా ఉంటాయి.

ఎత్నిక్ ఫ్యాషన్ కాళహస్తి కలంకారీ

ఆలయకళగా ఒకప్పుడు ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తి కలంకారీ.. ఇప్పుడు వస్త్ర ప్రపంచంలో లేటెస్ట్ ఫ్యాషన్‌గా మారింది. వయ్యారాల వొంపులు తిరిగే పూలూ, లతలతో కూడిన డిజైన్ చీరలకు డిమాండ్ ఎక్కువ. పౌరాణిక ఘట్టాలను రాసిన కలంకారీ చీరల కోసం సంపన్న మహిళలు పోటీ పడుతుంటారు. బ్లాక్ ప్రింటింగ్, స్క్రీన్ ప్రింటింగ్‌తో ఉన్న కలంకారీ చీరలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నా శ్రీకాళహస్తి పెన్ కలంకారీకి ఉన్న డిమాండ్ తరగనిది. చేత్తో బొమ్మ గీసి, లతలూ పూల డిజైన్లు రాసి, వాటికి ఒక్కో దశలో ఒక్కో రంగు అద్దుతూ చేసే కళాత్మక ప్రక్రియ ఇది. చెట్ల ఆకులూ, వేర్లతో కూడిన సహజసిద్ధమైన రంగులే శ్రీకాళహస్తి కలంకారీ చీరలకు ఎక్కువగా వాడుతారు. శ్రీకాళహస్తిలో 35 కలంకారీ యూనిట్లు ఉన్నాయి. వందలాదిమందికి ఇవి ఉపాధి చూపుతున్నాయి. ఏటా శ్రీకాళహస్తి నుంచి 60 నుంచి 70వేల కలంకారీ చీరలు ఉత్పత్తి అవుతున్నట్లు అంచనా.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి





లేటెస్ట్ ట్రెండ్

- జరీ అంచున్న కంచిపట్టు చీర మీద కలంకారీ డిజైన్ రాసిన చీరలకు ఇప్పుడు డిమాండ్ ఉంది. వీటి ధర రూ.20వేలనుంచి రూ.30వేల దాకా ఉంటుంది.
- టస్సర్, టిస్యూ, బెంగళూరు సిల్క్, చందేరి సిల్క్, మదనపల్లి పట్టు, మంగళగిరి సిల్క్, క్రేప్ క్లాత్, లెనిన్‌క్లాత్, కోట సిల్క్ చీరల మీద కలంకారీ డిజైన్లు ధరించేందుకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. వీటి ధర రూ.10వేలు నుంచి రూ.20వేల వరకు ఉంది.

పోలూరు సరిగ చీరలు



సూళ్లూరుపేట సమీపంలోని మన్నారుపోలూరు సరిగచీరలు ప్రత్యేకమైనవి. చేనేత నుంచి మరమగ్గాలకు ఎక్కువగా మారిపోయినా ఇప్పటికీ సంప్రదాయంగా ఇక్కడ చేనేత చీరలు కూడా తయారవుతున్నాయి. అయిదు రకాల చీరలు మన్నారుపోలూరులో నేస్తారు. పడగూ, పేకా కూడా పట్టు నూలు కలిగిన పూర్తి పట్టు చీరలు, కాటన్‌పై పాలిస్టర్ చీరలు, కాటన్‌పై పట్టు, జరీ బాండ్ చీరలు , సాధారణ కాటన్ చీరలు ఇక్కడ తయారవుతాయి. తరాలుగా ఇక్కడ వందలాది కుటుంబాలు చేనేతనే జీవనాధారం చేసుకున్నాయి. కంచి, ఆరణి లకు ఈ చీరలు పంపుతారు.

-సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

లేటెస్ట్ ట్రెండ్

- మన్నారుపోలూరులో నేసే గ్రాఫికల్ డిజైన్ పట్టు చీరలను తాజాగా ఇష్టపడుతున్నారు. జరీ బార్డర్, బుటా, నిండు డిజైన్‌గల కొంగు.. ఈ చీరల ప్రత్యేకత. వీటి ధరలు రూ.1500 నుంచి 15 వేల దాకా ఉన్నాయి.



మగువలు మెచ్చే మగ్గం డిజైన్స్

నగరంలో ట్రెండ్ మగ్గం వర్క్ చీరలు. పెళ్లిళ్లలో ఇవే హైలెట్. కోరిన డిజైన్లను కోరిన రంగు మీద, నచ్చిన క్లాత్‌పై కుట్టించుకోవచ్చు. మెషీన్ ఎంబ్రాయిడరీ తోనూ ఇవి తయారవుతాయి కానీ, ధర ఎక్కువే అయినా చేతి పనికే డిమాండ్ ఎక్కువ. తిరుపతిలో 500 మగ్గం సెంటర్లు ఉన్నాయంటేనే ఈ రకం చీరలపై మహిళలకున్న మోజు ఎలాంటిదో అర్థం అవుతుంది. వివిధ రంగుల దారాలతో పాటూ చమ్కీలు, జరీ, అద్దాలు కూడా డెకరేటివ్‌గా కుడతారు. నెట్‌లో ఎంపిక చేసుకున్న డిజైన్ ఫోటోలు చూపి అలా కుట్టించుకునే సౌలభ్యం ఉండడం దీని ప్రత్యేకత.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

లేటెస్ట్ ట్రెండ్

ఆన్‌లైన్ డిజైన్స్‌ను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. చీర వారే తెచ్చుకుంటారు. డిజైన్‌ను బట్టీ ఒక్కో చీరకు రూ. రెండు వేల నుంచీ ఇరవై వేల దాకా మగ్గం పనికే తీసుకుంటారు. ఈ చీరలు మార్కెట్‌లో లక్ష దాకా పలుకుతాయి.



ఘనంగా అమరరాజా 39వ వ్యవస్థాపక దినోత్సవం



రేణిగుంట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలంలోని అమరరాజా పరిశ్రమలో శుక్రవారం 39వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరరాజా సంస్థల చైర్మన్ గల్లా జయదేవ్ మాట్లాడుతూ.. 1985లో అమరరాజా పవర్ సిస్టమ్‌గా కార్యకలాపాలు ప్రారంభించిన గ్రూప్ ఇప్పుడు ఆరు కంపెనీలు, 17 వ్యాపారాలతో 18,500కుపైగా ఉద్యోగులను కలిగి ఉందన్నారు. అనంతరం ఎంపిక చేసిన ముగ్గురు గ్రామీణ పారిశ్రామికవేత్తలకు రూ.3లక్షల నగదు పురస్కారాన్ని అందించారు. అమర రాజాకు చెందిన మార్కెటింగ్ హెచ్‌ఆర్, ఫైనాన్స్, సప్లై చెయిన్ సీఎక్స్‌వోలకు సంవత్సరం మెంటార్‌షిప్ అందించారు. ఎంఐటీ తొలి అంతర్జాతీయ అంధ విద్యార్థి శ్రీకాంత్ బొల్లా తన స్ఫూర్తిదాయకమైన ప్రయాణాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో అమరరాజా పరిశ్రమ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గల్లా రామచంద్ర నాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, డాక్టర్ రమాదేవి గౌరినేని, హర్షవర్ధన్ గౌరినేని, విక్రమాదిత్య, సిద్ధార్థ్ గల్లా, గ్రూప్ ఆపరేషన్ హెడ్ నరసింహులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మ్యారిటైమ్ బోర్డుకు 'పులికాట్' పనులు

తిరుపతి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పులికాట్ సరస్సు అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వం ఏపీ మ్యారిటైమ్ బోర్డుకు అప్పగించింది. జిల్లాలోని తడ, సూళ్ళూరుపేట, దొరవారిసత్రం, వాకాడు మండలాల పరిధిలో సరస్సు వున్న సంగతి తెలిసిందే. తమిళనాడు పరిధిలోని సరస్సులో సముద్ర ముఖ ద్వారాలకు తరచూ పూడిక తీస్తున్నారు. జిల్లా పరిధిలో మాత్రం గత ప్రభుత్వాలు విస్మరించడంతో ఇక్కడి సముద్ర ముఖద్వారాలన్నీ పూడిపోయాయి. సముద్రపు నీరు సరస్సులోకి రాకపోవడంతో సముద్ర రకాల చేపలు, రొయ్యలు, ఇతర రకాల మత్స్య సంపద ఇక్కడ అభివృద్ధి చెందడం లేదు. వీటిపై ఆధారపడ్డ మత్స్యకార కుటుంబాలు తమ పరిధి దాటి చేపల వేటకు వెళ్లాల్సి రావడంతో తరచూ తమిళనాడు జాలర్లతో సరిహద్దు తగాదాలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు సముద్ర ముఖద్వారాల పూడిక తీతకు రూ. 97 కోట్లు కేటాయించారు. వాకాడు మండలం పూడిరాయి దొరువు వద్ద చేపట్టాల్సిన ఈ పనులను ఏపీ మ్యారిటైమ్ బోర్డుకు అప్పగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆవిష్కరణలకు దిక్సూచిగా ఏపీ

- సీఐఐ రాష్ట్ర చైర్మన్ మురళీకృష్ణ
- వర్చువల్‌గా మాట్లాడిన సీఎస్ నీరబ్

తిరుపతి, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): ఆవిష్కరణలకు దిక్సూచిగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని సీఐఐ ఏపీ చైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ అన్నారు. తిరుపతిలో శుక్రవారం జరిగిన సీఐఐ (కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) ఏపీ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో దార్శనిక నాయకులు, ఆవిష్కర్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొని సుస్థిర వృద్ధికి ఉన్న అవకాశాలను అన్వేషించారు. ప్రారంభ సెషన్‌లో మురళీకృష్ణ స్వాగతోపన్యాసం చేస్తూ అభివృద్ధిని ప్రోత్సహించడానికి అపారమైన ప్రతిభ, వనరులను ఏపీ ఉపయోగించుకుంటుందన్నారు. అందరం కలిసి మరింత సమ్మిళిత, సృజనాత్మక, సుసంపన్న భవిష్యత్తుకు బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. సదస్సుకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ వర్చువల్‌గా మాట్లాడారు. సరికొత్త ఆవిష్కరణలు అవసరమని, ఆదిశగా ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంసిద్ధతతో ఉన్నాయన్నారు. అరకువ్యాలీ నుంచి వస్తున్న అరబిక్ కాఫీ, ఇటీవల ఆవిష్కృతమైన సెలైన్ వాటర్ లాంథర్ గురించి ప్రస్తావించారు. ఐఐటీ తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ.. విజ్ఞాన ఆధారిత సహకారాలను సృష్టించడంలో ఉన్నత విద్యా సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. రాష్ట్ర విభజన సమయంలో రెండు, మూడు కేంద్ర విద్యా సంస్థలు మాత్రమే ఉండగా నేడు చాలా వచ్చాయన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం సాయంతో స్టార్టప్ బిజినెస్ అభివృద్ధి కోసం ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. బలమైన ఎకోసిస్టమ్స్, స్టార్టప్‌లకు తిరుపతిలో ఉన్న ప్రయోజనాలను వివరించారు. తిరుపతిలో బలమైన పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి అందుబాటులో ఉన్న అనేక పథకాలను పరిశ్రమలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఐఐ తిరుపతి జోన్ చైర్మన్ పుష్పిత్ గార్గ్ మాట్లాడుతూ సృజనాత్మకత సంస్కృతిని పెంపొందించడం ద్వారా ఏపీలో సుస్థిర భవిష్యత్తును నిర్మించవచ్చన్నారు. సుస్థిరాభివృద్ధికి కేంద్రంగా మారడానికి తిరుపతికి అపారమైన సామర్థ్యం ఉందని సీఐఐ ఆంధ్రప్రదేశ్ మాజీ చైర్మన్ విజయ్ నాయుడు గల్లా వివరించారు. సుస్థిర అభివృద్ధికి తోడ్పడేందుకు ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్స్ అవసరాన్ని ఎన్ఆర్‌డీసీ సీనియర్ రీజినల్ మేనేజర్, డబ్ల్యూఐపీవో టెక్నాలజీ ఇన్నోవేషన్ సెంటర్ హెడ్ డాక్టర్ బిజయ్ కుమార్ సాహూ స్పష్టం చేశారు. డిజిటల్ టెక్నాలజీ కన్సల్టెంట్, ఐఓటీ మాజీ రీజినల్ డైరెక్టర్ సునీల్ డేవిడ్ మాట్లాడుతూ కర్ణాటక తరహాలో ప్రతి రాష్ట్రానికి తమ బ్రాండ్ కాఫీని కస్టమైజ్ చేసినట్లుగా డైనమిక్స్ ఉన్నాయన్నారు. తిరుపతిలో 50కి పైగా ఐటీ కంపెనీలు, 10కి పైగా ఎమ్మెన్సీ కంపెనీలు ఉన్నాయని టెక్నాలజీ కంపెనీస్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (టీసీవోఏపీ) అధ్యక్షుడు వంశీకృష్ణ రాయల్ తెలిపారు. తిరుపతికి ఉన్న ఉత్తమ అవకాశాల్లో శ్రీసిటీ ఒకటన్నారు. అనంతరం జరిగిన చర్చల్లో విద్య, వైద్యం, మార్కెటింగ్ వంటి రంగాలకు సంబంధించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సందేహాలను ప్యానెల్ సభ్యులు నివృత్తి చేశారు.



రికార్డులు దహనంచేసి భూముల కబ్జా

- వైసీపీ పాలనలో అక్రమాలపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

రేణిగుంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో రెవెన్యూ రికార్డులను దహనంచేసి ప్రభుత్వ భూములను కబ్జా చేశారని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దీంతో తమకు ఇష్టమొచ్చినట్లుగా ఆన్‌లైన్‌లో పేర్లు మార్చుకుని భూములు కాజేశారన్నారు. రేణిగుంట మండలం అన్నాస్వామిపల్లెలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు నల్లకోటును అడ్డుపెట్టుకుని చేసిన భూదందాను వెలికి తీస్తామన్నారు. ప్రభుత్వ భూమిలో బంగ్లా నిర్మించుకుని నివాసం ఉండడాన్ని గుర్తించినట్లు తెలిపారు. సూరప్పకశం, కొత్రమంగళంలతోపాటు ఈ గ్రామంలోని సర్వే నెం. 385, 341/1, 342/3, 343/3, 338/1, 2, 334, 335లలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు గుర్తించామన్నారు. అన్నాస్వామిపల్లెలో భూములను రీసర్వే చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. త్వరలోనే కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఆలయాన్నీ వదల్లేదు

మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ముక్కంటి ఆలయాన్నీ వదలకుండా దోచుకున్నారని సుధీర్‌రెడ్డి విమర్శించారు. జగనన్న కాలనీల కోసం స్థలసేకరణలో అగ్రిమెంట్లు చేసుకుని కేవలం రూ.7లక్షలు వంతున రైతులకు చెల్లించి ప్రభుత్వం నుంచి రూ.45 కోట్లు కొట్టేశారన్నారు. శ్రీకాళహస్తి రాజీవ్‌నగర్ కాలనీలో అక్రమ నిర్మాణాల తొలగింపులో కనిపించని మాజీ ఎమ్మెల్యే.. స్వర్ణముఖి నది ఒడ్డున ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులను అడ్డుకోవడంలో అంతర్యమేమిటో చెప్పాలన్నారు. వైసీపీ పాలనలో కొంత మంది రేణిగుంట పరిసరాల్లో ఆక్రమిత భూముల్లో ప్లాట్లు వేసి విక్రయించారన్నారు. ఇలాంటి ప్లాట్లు కొనవద్దని తాను అప్పట్లో చెప్పానని గుర్తుచేశారు. ఎవరైనా వీటిని కొని నష్టపోతే అందుకు వైసీపీ నాయకులే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దారు సురేష్ బాబు, ఎంపీడీవో విష్ణు చిరంజీవి, అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



2018కి ముందు, తర్వాత కబ్జా భూముల్లో తేడాలకు సంబంధించి శాటిలైట్ చిత్రాలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే సుధీర్

పోక్సో కేసులో నలుగురికి పదేళ్ల జైలు

నెల్లూరు (లీగల్), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఓ బాలికను ప్రేమించానని నమ్మించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తితోపాటు అందుకు సహకరించిన మరో ముగ్గురికి పదేళ్ల జైలు శిక్ష, రూ.22 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సుమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు...ఓజిలి మండలం ఇనగుంట గ్రామానికి చెందిన దండోలు సుబ్బారావు అలియాస్ సుబ్బు 10వ తరగతి చదువుతున్న ఓ బాలికను ప్రేమ, పెళ్లి పేరుతో నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడికి బుచ్చినాయుడు కండ్రిగ మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన కోగిలి సుబ్రహ్మణ్యం, ఓజిలి మండలం ఇనగుంట గ్రామానికి చెందిన ఎల్లంటి వెంకటయ్య, బాలాయపల్లి మండలం జయంపు గ్రామానికి చెందిన మంగుళూరు వాణి సహకరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఓజిలి పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితులు ఒక్కొక్కరికి పదేళ్ల చొప్పున జైలు శిక్ష, 22 వేల రూపాయల వంతున జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

అమిత్‌షాపై పోస్టింగ్

పోలీసులకు బీజేపీ నేతల ఫిర్యాదు

వెదురుకుప్పం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించేది బీజేపీయే అని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు.శుక్రవారం చిత్తూరు జిల్లా కార్వేటినగరంలో బీజేపీ నేతలు రాజశేఖర్, రాజేంద్రన్, యువరాజు మాట్లాడుతూ... అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేశారని వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కార్వేటినగరం మండలానికి చెందిన వ్యక్తి ఒకరు సోషల్ మీడియాలో అమిత్‌షా చనిపోయాడని, శ్రద్ధాంజలి ఘటించాలని, డీపీగా ఫొటోలు వాడుకోవాలని పోస్టింగ్ పెట్టడంతో శుక్రవారం కార్వేటినగరం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.కార్వేటినగరం మండల బీజేపీ నాయకులపై కూడా హేయమైన పోస్టింగులు పెట్టారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుత్‌ను ఆదా చేయడం అలవర్చుకోవాలి

ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్


బహుమతులు అందిస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

పెనుమూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌ను ఆదా చేయడం ప్రతి ఒక్కరూ అలవరుచుకోవాలని, అప్పుడే భవిష్యత్తరాలకు మార్గదర్శకులుగా ఉంటారని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఆయన శుక్రవారం పెనుమూరులోని జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయస్సు నుంచే విద్యుత్ పొదుపుపై అవగాహన పెంపొందించుకోవాలని, దీనిపై తమ గ్రామాల్లో తెలియని వారికి కూడా తెలియజేయాలని అన్నారు. అనంతరం సబ్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈలు సురేష్‌కుమార్, జగదీష్, ఏడీ శేషాద్రి, ఏఈ తులసీప్రసాద్, హెచ్ఎం వెంకటేశులు నాయుడు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా మహిళా సమాఖ్య నూతన కార్యవర్గం



చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా సమాఖ్య నూతన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్డీఏ సమావేశ మందిరంలో ఇన్‌చార్జి పీడీ శ్రీదేవి ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా ప్రమీల (వెదురుకుప్పం), కార్యదర్శిగా కార్తి (గుడిపాల), కోశాధికారిగా ప్రసన్న (పూతలపట్టు), ఉపకార్యదర్శిగా గౌతమి (కుప్పం), ఉపాధ్యక్షురాలిగా చిన్నరెడ్డెమ్మ (పెద్దపంజాణి), వ్యవస్థాపక సభ్యులుగా సుమలత (పలమనేరు), నరసమ్మ (గంగవరం), ప్రభావని (చౌడేపల్లి), ప్రభావతి (నగరి), మహేశ్వరి (వి.కోట), రజియా (యాదమరి), శిరీష (రామకుప్పం)లు ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యవర్గ ప్రతినిధులను అధికారులు అభినందించారు.

గోకులం షెడ్ల పరిశీలన


దాసేగౌనూరులో రైతు వెంకటాచలంతో మాట్లాడుతున్న కలెక్టర్, పీడీ

కుప్పం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలో వివిధ నిర్మాణ దశల్లో ఉన్న గోకులం షెడ్లను, డ్రిప్ పరికరాల ద్వారా జరుగుతున్న సాగు పద్ధతులను కడా పీడీ వికాస్ మర్మత్‌తో కలిసి కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం పరిశీలించారు.గోపనపల్లె, దాసేగౌనూరు గ్రామాల్లో పాడి రైతులను, వ్యవసాయ రైతులను పలకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోకులం షెడ్ల నిర్మాణంకోసం ప్రభుత్వం మంజూరు చేస్తున్న సబ్సిడీని వినియోగించుకుని పాడి రైతులు షెడ్లను సాధ్యమైనంత త్వరలో నిర్మించుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన నమూనా మేరకే నిర్మాణం ఉండాలన్నారు. అలాగూ బిందు, తుంపర్ల సేద్య పరికరాలతో తక్కువ నీటితో ఎక్కువ భూమిని సాగు చేయవచ్చన్నారు. వీటిని కూడా రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దాసేగౌనూరులో డ్రిప్ పద్ధతిలో పంట సాగు చేస్తున్న రైతు వెంకటాచలం పొలాన్ని పరిశీలించారు. అక్కడే కప్పు లెవల్ వరకు నిర్మాణమైన గోకులం షెడ్డును కూడా పరిశీలించారు. వ్యవసాయ, పశు సంవర్థక శాఖ అధికారులు పాల్గొన్నారు.

25 విండోల ఇన్‌చార్జిల పదవీ కాలం పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 25ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సింగిల్ విండో) అధికారిక పర్సన్ ఇన్‌చార్జిల పదవీకాలాన్ని ప్రభుత్వం మరో ఆరునెలలు పొడిగించింది. ఈ పెంపు శనివారం నుంచి ఆరు నెలలు లేదా ఎన్నికలు జరిగే వరకు వర్తిస్తుంది. జిల్లాలో మొత్తం 37 సింగిల్ విండోలుండగా, వీటిలో 12 విండోల పదవీకాలం ఇంకా కొనసాగుతోంది.

సీడీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జి పదవీ కాలం పొడిగింపు

ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి పదవీ కాలం పొడిగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అధికారిక పర్సన్ ఇన్‌చార్జి పదవీ కాలం ఈ నెల 26తో ముగియనుంది. దీంతో ఈ నెల 27 నుంచి 2025 జూన్ 26 వరకు ఆరు నెలలు లేదా ఎన్నికలు జరిగే వరకు పొడిగింపు వర్తిస్తుంది.

ఆరు మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆరు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. గడిచిన 24 గంటల్లో కార్వేటినగరంలో 8.2మి.మీ, నింద్రలో 4.2, నగరిలో 3.8, విజయపురంలో 2.4, వెదురుకుప్పంలో 1.2, సదుంలో 0.8 మి.మీ వర్షపాతం నమోదయ్యింది.

తగ్గిన స్థిరాస్తి జోరు

లక్ష్యం ఘనం...
ఆదాయం అంతంత మాత్రం



చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఖజానాకు కామధేనువు లాంటి రిజిస్ట్రేషన్ల శాఖ లక్ష్యం ఘనంగా వున్నా ఆదాయం అంతంత మాత్రంగానే ఉంది. గత వైసీపీ ప్రభుత్వం నిర్వాహకంతో స్థిరాస్తి వ్యాపారం కుదేలయ్యింది. మరోవైపు రిజిస్ట్రేషన్ చార్జీలు విపరీతంగా పెరగడం వల్ల భారం మోయలేక కొందరు ఒప్పందాలతోనే సరిపెట్టుకుంటున్నారు. అస్తి బదలాయింపునకు ఒప్పందం చట్టబద్ధత కాకపోయినా రిజిస్ట్రేషన్ చార్జీలు భరించలేక కొందరు వాయిదా వేసుకుంటున్నారు. ఫలితంగా రిజిస్ట్రేషన్ల సంఖ్య అనుకున్న మేరకు నమోదు కాలేదు. అంతేకాకుండా స్టాంపుల అమ్మకాలను గత ప్రభుత్వం పూర్తిగా ప్రైవేటీకరణ చేయడంతో కూడా ప్రభుత్వ ఖజానాకు ఆదాయం తగ్గింది ఈ పరిస్థితిని గుర్తించిన కూటమి ప్రభుత్వం స్టాంపుల అమ్మకాలను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పునఃప్రారంభించడంతో ఇటీవల తనఖా రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరగడం ప్రారంభమైంది. భూములు, భవనాలు తనఖా పెట్టి కొందరు ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు తీసుకుంటున్నారు.ఈ కారణంగా తనఖా రిజిస్ట్రేషన్, డాక్యుమెంట్ల విడుదలకు కొంత ఆదాయం లభిస్తోంది. డిసెంబరు నెల నుంచే కొంతమేరకు ఆదాయం పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

● చిత్తూరు జిల్లాలో....

చిత్తూరు జిల్లాలో ఎనిమిది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఎస్ఆర్ కార్యాలయాల్లో ఈసారి పెద్దగా లక్ష్యాలు నమోదు కాలేదు. ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి రాబడి లక్ష్యం రూ.221.88 కోట్లుగా నిర్దేశించింది. నవంబరు నెలనాటికి రూ.142 కోట్ల లక్ష్యంలో రూ.93.99 కోట్లు మాత్రమే (66.19శాతం) వసూలయ్యింది. మొత్తం 39,703 డాక్యుమెంటేషన్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఎస్ఆర్‌ల వారీగా అత్యధికంగా కార్వేటినగరంలో 85.84శాతం, పలమనేరులో 75.62శాతం, కుప్పంలో 69.07శాతం రాబడి లక్ష్యంలో కలెక్షన్లు జరిగాయి. అతితక్కువగా 47.84శాతంతో బంగారుపాళ్యం నిలిచింది. పలు పట్టణ ప్రాంతాల్లో ప్లాట్లధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో కూడా స్థిరాస్తుల క్రయవిక్రయాలు తగ్గుతున్నాయని కొందరు విశ్లేషిస్తున్నారు.

జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి ఇలా.... (రూ.కోట్లలో)

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	లక్ష్యం	నవంబరు వరకు ఆదాయం	రాబడి శాతం	డాక్యుమెంట్ల సంఖ్య
బంగారుపాళ్యం	7.51	3.59	47.84	2167
కుప్పం	16.44	11.35	69.07	7537
పలమనేరు	21.62	16.34	75.62	6766
పుంగనూరు	20.97	12.49	59.66	5708
చిత్తూరు (ఆర్వో)	48.49	31.28	64.51	8940
కార్వేటినగరం	6.21	5.33	85.84	3632
నగరి	10.45	7.15	68.46	2167
చిత్తూరు రూరల్	10.29	6.42	62.41	2786
మొత్తం	142.00	93.99	66.19	39703

కుక్కలు అడ్డురావడంతో ద్విచక్ర వాహనం బోల్తా

● ఒకరి మృతి .. మరొకరికి గాయాలు


మృతి చెందిన టీడీపీ కార్యకర్త దినకర్

బంగారుపాళ్యం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని రిలయన్స్ పెట్రోల్ బంక్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త మృతి చెందగా, మరో యువకుడు తీవ్ర గాయాలపాలైన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నలగాంపల్లెకు చెందిన శేఖర్ కుమారుడు దినకర్, రమేష్ కుమారుడు విక్రమ్ ద్విచక్ర వాహనంలో సొంతపని నిమిత్తం బంగారుపాళ్యానికి వచ్చి పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా రిలయన్స్ పెట్రోల్ బంక్ సమీపంలో కుక్కలు అడ్డువచ్చాయి. వాటిని తప్పించబోయి రహదారి పక్కన ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో విక్రమ్‌కు స్వల్ప గాయాలు కాగా దినకర్ తలకు తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటిన బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడి డాక్టర్లు దినకర్(29)ను పరిశీలించి మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ఆస్పత్రి వద్దకు చేరుకున్న బంధుమిత్రులు, స్నేహితులు బోరున విలపించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. టీడీపీ కార్యకర్త దినకర్ మృతి పార్టీకి తీరని లోటని మండల పార్టీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ అన్నారు. మృతుడి కుటుంబాన్ని పార్టీపరంగా ఆదుకుంటామన్నారు.

పట్ట పగలే ఏనుగుల సంచారం


ఏనుగుల సంచారంతో దెబ్బతిన్న వరి

సోమల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ ఇర్లపల్లె, ఈ. నడింపల్లె, అటవీ శివారు పొలాల్లోకి శుక్రవారం పట్టపగలే నాలుగు ఏనుగులు రావడంతో రైతులు పరుగులు తీశారు. గురువారం రాత్రి పార్వతీపురానికి చెందిన నాగరాజ, శీనప్ప, పురుషోత్తం నాయుడు, ప్రతాప్ తదితరుల పొలాల్లోని వరి, టమోటా పంటలపై పడిన ఏనుగులు తొక్కివేసి నష్టపరిచాయి. డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశాయి. నాగరాజకు చెందిన పశుగ్రాస క్షేత్రంలో సంచరించి పైర్లను తొక్కివేసి పశువులకు మేత లేకుండా చేశాయని రైతులు వాపోయారు. తిరుపతి - పుంగనూరు రోడ్డు సమీపంలోని చెన్నపట్నం చెరువు కట్ట వద్ద వినాయకస్వామి ఆలయం పరిసరాల్లో తిరగాడి నిల్వ చేసిన వరిధాన్యాన్ని తొక్కుకుంటూ కట్టపై నడిచి వెళ్లినట్లు పార్వతీపురం రైతులు తెలిపారు. చెన్నపట్నం చెరువు మొరవ వద్ద ఉన్న అరటి తోటలో ఏనుగులు సంచరిస్తున్నాయన్న సమాచారంతో పొలాల వైపు వెళ్ళలేక పోతున్నామన్నారు. చెన్నపట్నం సమీపంలోని ఇర్లపల్లె వద్దకు ఏనుగులు రావడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఇరికిపెంట సచివాలయం వద్ద జరిగిన రెవెన్యూ సదస్సులో ఏనుగుల సంచారంపై అధికారులకు పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. బేస్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు.

క్రీడారంగం అభివృద్ధికి సహకరించండి

కేంద్రమంత్రులకు శాప్ చైర్మన్ విజ్ఞప్తి


కేంద్రమంత్రి మాండవీయకు వినతిపత్రం అందజేస్తున్న రవినాయుడు, చిత్రంలో ఎంపీలు హరీష్, అప్పలనాయుడు

న్యూఢిల్లీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రీడా సౌకర్యాలను కల్పించాలని కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవినాయుడు విజ్ఞప్తి చేశారు. టీడీపీ ఎంపీలు జీఎం హరీష్, కలిశెట్టి అప్పలనాయుడుతో కలిసి కేంద్ర మంత్రితో శుక్రవారం భేటీ అయిన ఆయన ఏపీలోని క్రీడారంగానికి మంజూరు చేయాల్సిన ప్రాజెక్టులపై చర్చించారు. రూ.237 కోట్ల విలువైన 24 స్పోర్ట్స్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులను ఖేలో ఇండియాలో భాగంగా మంజూరు చేయాలని కోరారు. గతంలో ప్రతిపాదించిన రెండు నేషనల్ ఎక్స్‌లెన్సీ సెంటర్లను కాకినాడ, గుంటూరుకు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాకినాడలో హాకీ, షూటింగ్, గుంటూరు ఏఎన్‌యూలో అథ్లెటిక్స్ ఆర్చరీ, వెయిట్ లిఫ్టింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. అదనంగా మరో 26 ఖేలో ఇండియా డిస్ట్రిక్ట్ లెవల్ సెంటర్లను మంజూరు చేయాలన్నారు. అలాగే తిరుపతిలోని ఖేలో ఇండియా రెసిడెన్షియల్ సెంటర్‌లో అథ్లెటిక్స్, రెజ్లింగ్ విభాగాలకు సంబంధించిన సెంటర్లను ఏర్పాటు చేయాలని, క్రీడాకారుల రైల్వే రాయితీలను పునఃప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. నేషనల్ గేమ్స్, ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణకు అవకాశం ఇవ్వాలన్నారు. మరోవైపు కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడితో భేటీ సందర్భంగా ఏపీ నూతన స్పోర్ట్స్ పాలసీలో భాగంగా క్రీడావసతుల ఏర్పాటుకు 10శాతం సీఎస్ఆర్ నిధులను సమకూర్చేందుకు సహకరించాలని కోరారు. ఎయిర్‌లైన్ ఆపరేటింగ్ కంపెనీల నుంచి స్పోర్ట్స్ పాలసీకి సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని విన్నవించారు. ఎయిర్ హోస్టెస్, ఎయిర్ గ్రౌండ్ స్టాఫ్‌కు లైఫ్‌సేవింగ్‌పై ఏపీలో లైఫ్ సేవింగ్ కోర్సు ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రికి రవినాయుడు విజ్ఞప్తి చేశారు.

14 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



బంగారుపాళ్యం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం రెవెన్యూ, పోలీసు అధికారులకు అందిన సమాచారం మేరకు కేజీ సత్రం వద్ద వాహనాలు తనిఖీ చేశారు. టీఆర్ 06 జీపీ 5690 నెంబరు గల లారీని తనిఖీ చేసి, అందులో ఉన్న 14 టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. చిత్తూరు నుంచి కర్ణాటకకు రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా కేజీ సత్రం వద్ద అదుపులోకి తీసుకున్నామని, లారీ డ్రైవర్ పరార య్యాడని సీఐ తెలిపారు. ఈబియ్యం విలువ రూ.5.70 లక్షలు ఉంటుందన్నారు. తహశీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ సూచన మేరకు పట్టుబడ్డ రేషన్ బియ్యాన్ని చిత్తూరు గోదాముకు తరలించినట్లు ఆర్ఐ మధుసూదన్ తెలిపారు. ఈ దాడుల్లో రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

మణికంఠేశ్వర స్వామి ఆలయ పరిసరాలలో ఫొటోలు దిగవచ్చు

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధ ఆలయమైన మణికంఠేశ్వర స్వామి ఆలయ పరిసరాలలో భక్తులు ఫొటోలు దిగవచ్చునని ఈవో పెంచలకిషోర్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మణికంఠేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో భక్తులు తమ సొంత కెమేరాలు, సెల్‌ఫోన్ల ద్వారా ఫొటోలు తీసుకోవడానికి ఎవరి అనుమతి అవసరం లేదని, ఎవరికీ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన చెప్పారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వ నమోదులో పాలసముద్రం టాప్

పాలసముద్రం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వ నమోదులో పాలసముద్రం మండలం జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచినట్లు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు తెలిపారు. ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడు ఆధ్వర్యంలో పాలసముద్రం మండలంలో టీడీపీ సాధారణ సభ్యత్వాన్ని 5,350 మంది తీసుకున్నారని తెలిపారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో 38 మంది జీవిత కాలం సభ్యత్వం తీసుకుని రాష్ట్రంలో రెండవ స్థానం లభించగా, అందులో 22 మంది పాలసముద్రం మండల వాసులే లక్ష రూపాయలు చెల్లించి సభ్యత్వం తీసుకున్నారని వారు తెలిపారు.

41 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6వ తేదీ నుంచి జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం సదస్సులు కొనసాగుతున్నాయి. శుక్రవారం 41 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు జరగ్గా, వీటి సంఖ్య ఇంతవరకు 380కి పెరిగింది. జిల్లాలో మొత్తం 822 రెవెన్యూ గ్రామాలున్నాయి. శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 1225 మంది రైతులు 577 అర్జీలను అందజేశారు. ఇంతవరకు అందిన అర్జీల సంఖ్య 6562కు పెరిగింది.

చిరుతల దాడిలో 6 గొర్రెల మృతి

చౌడేపల్లె, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి) :చిరుత పులుల దాడిలో 6 గొర్రెలు మృతి చెందాయి. చౌడేపల్లె మండలం దుర్గసముద్రం పంచాయతీ దాదేపల్లెకు చెందిన హైదర్‌ఖాన్ కథనం ప్రకారం....రోజూలాగే సమీపంలోని ఆంజనేయ స్వామి గుట్ట వద్ద ఆయన గొర్రెలు మేపుకుంటున్నాడు. సాయంత్రం 3 చిరుత పులులు గొర్రెల మందపై దాడి చేసి 6 గొర్రెలను చంపేశాయి.వాటి దాడిలో మరో 4 గొర్రెలకు గాయాలయ్యాయి. చిరుతలు దాడి చేయడం చూసి మిగిలిన గొర్రెలతో పారిపోయి వచ్చినట్లు హైదర్‌ఖాన్ తెలిపారు. రూ.60 వేల విలువ చేసే గొర్రెలు మృతి చెందాయని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రాష్ట్రానికి రోల్ మోడల్‌గా కుప్పం!

● గత ప్రభుత్వం జేబులు నింపుకోవడానికే పనిచేసింది
● నారా భువనేశ్వరి


గుండ్లమడుగు సభలో టీడీపీ నేతలతో భువనేశ్వరి


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తూ..

కుప్పం/కుప్పం రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబుగారిని ప్రతిసారీ కుప్పంనుంచి గెలిపిస్తున్నారు. ఆయనతోపాటు మా కుటుంబం మొత్తం మీకు రుణపడి ఉంటుంది. రాష్ట్రానికే కుప్పాన్ని రోల్ మోడల్‌గా చేసే పనిలో చంద్రబాబుగారు ఉన్నారు. కాకపోతే ఒకట్రెండేళ్లు కాస్త ఓపిక పట్టాలి. ఓపిక పడితే అన్నీ వస్తాయి.' అని ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి కుప్పం ప్రజలకు హామీ ఇచ్చారు. కుప్పం నియోజకవర్గం రెండవ రోజు పర్యటనలో భాగంగా కుప్పం మండలంలోని వానగుట్టపల్లె, గుండ్లమడుగు, అడవిబూదుగూరు, డీకేపల్లెల్లో ఆమె పర్యటించారు. స్థానిక మహిళలతో ముఖాముఖిలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ కక్షపూరిత రాక్షస పాలనలో కష్టాలు, కన్నీళ్లు తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు.టీడీపీ అధికారంలోకి రాగానే చంద్రబాబు కుప్పం నియోకవర్గ అభివృద్ధికోసం ఏకంగా 40 పథకాలు ప్రవేశపెట్టారన్నారు. రోడ్లు, మురుగు కాలువలు అభివృద్ధికి, ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణాలు వంటి సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారని, ఒకదానివెంట ఒకటి సాకారమవుతాయని హామీ ఇచ్చారు. కాకపోతే ఒకట్రెండేళ్లు కొద్దిగా ఓపిక పట్టాలన్నారు. ఎందుకంటే గత ప్రభుత్వం చంద్రబాబుకు ఖాళీ ఖజానా, అప్పులు మాత్రమే మిగిల్చిపోయిందన్నారు. వారి జేబులు నింపుకోవడానికి ప్రజల జీవితాలు ఛిన్నాభిన్నం చేసిందన్నారు. అయినా సరే సంపద సృష్టించి మరీ అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుడుతున్నారన్నారు.ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు తేవడంతోపాటు కోల్డ్ స్టోరేజీ నిర్మిస్తారని హామీ ఇచ్చారు. వ్యవసాయ ఉత్పత్తులకు ఎగుమతులకు ఇప్పటికే విమానాశ్రయం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయన్నారు. మహిళలు తమ కాళ్లమీద తాము నిలబడాలన్నది చంద్రబాబు లక్ష్యమే కాక, ఎన్టీఆర్ ట్రస్టు లక్ష్యం కూడానన్నారు. ఇప్పటికే డ్వాక్రా సంఘాలు ఆ పని చేస్తున్నాయని, త్వరలోనే ఎలిప్ అనే సంస్థను తీసుకొచ్చి మహిళల ఆదాయం ఎన్నోరెట్లు పెరిగేలా ప్రణాళికలు రూపొందాయని చెప్పారు. 'నిజం గెలవాలి' పేరుతో పర్యటనకు వచ్చినప్పుడు గ్రామాలలో ప్రజలు, పార్టీ కార్యకర్తలు పడుతున్న బాధలు చూసి చలించానన్నారు. పూరి గుడిసెల్లో, దుర్భర జీవితాలు తనను కదలించాయన్నారు. ఇప్పుడు వారందరినీ బాగు చేయాలని, అందరి జీవితాలను ఒక దరికి చేర్చి వారి కళ్లల్లో ఆనందం చూడాలన్న ఏకైక ధ్యేయంతో చంద్రబాబు కానీ, తాను కానీ ముందుకు సాగుతున్నామని తెలిపారు.గుండ్లమడుగులో జరిగిన సభలో భువనేశ్వరి 'నల్ల ఎరికంగళా' అని తమిళ్‌లో గ్రామస్థులను పలకరించారు. అంటే 'అంతా బాగున్నారా' అని అర్థం. తనకు తమిళం ఎలా వచ్చా అని ఆశ్చర్యపోవద్దని, తాను పుట్టింది, పెరిగింది, చదువుకుంది అంతా చెన్నైలోనేనని చెప్పారు.ప్రతి గ్రామ సభలో ప్రజలనుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. అడవిబూదుగూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మల్లానూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో మమేకమై వారితో గ్రూప్ ఫొటో దిగారు. కుప్పం మున్సిపాలిటీలోని మోడల్ కాలనీలో ప్రత్యంగిరాదేవి ఆలయానికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి వెండి కిరీటం సమర్పించారు.ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు,కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్,మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోకులాల నిర్మాణాలు వేగవంతం చేయాలి



షెడ్లను పరిశీలిస్తున్న డ్వామా అడిషనల్ పీడీ మల్లికార్జున

సోమల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గోకులాల షెడ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని డ్వామా అడిషనల్ పీడీ మల్లికార్జున తెలిపారు. శుక్రవారం సోమల మండలంలోని నెల్లిమంద, సోమల, చిన్న ఉప్పరపల్లె, కందూరుల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. షెడ్ల నిర్మాణాలు.. నాణ్యతా ప్రమాణాలు తప్పక పాటించాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను నూతనంగా నిర్మిస్తున్న గోకులాలకే కేటాయించాలని సూచించారు. షెడ్లు పూర్తి చేసిన వెంటనే బిల్లులు మంజూరు చేస్తామన్నారు. కొలతలు సక్రమంగా ఉండేలా రైతులు పాటించాలన్నారు. ఆయన వెంట ఏపీడీ శ్రీనివాసులు, ఏపీవో దినకర్‌బాబు, క్షేత్రసిబ్బంది పాల్గొన్నారు.

రామకుప్పంలో భువనేశ్వరి పర్యటనకు ఏర్పాట్లు

రామకుప్పం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి శని, ఆదివారాల్లో రామకుప్పం మండలంలో పర్యటించనున్నారు. ఆమె పర్యటనకు టీడీపీ శ్రేణులు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు మొద్దులవంకలో, 11.30 గంటలకు గాంధీనగరంలో మహిళలతో సమావేశమవుతారని ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ, వైస్ఎంపీపీలు అంజనేయరెడ్డి, చిన్నికృష్ణ, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు విజలాపురంలోని కస్తూరిబా గురుకుల విద్యాలయంలో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తారని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు చెల్దిగానిపల్లెలో ఆదర్శ రైతులు, మహిళల సమావేశంలో పాల్గొంటారన్నారు. కార్యక్రమాలకు పార్టీ నేతలు, కార్యకర్తలు, మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. శనివారం స్థానిక నేతలతో కలిసి గాంధీనగరం, మొద్దులవంక, విజలాపురంలో ఏర్పాట్లను పరిశీలించి పార్టీ శ్రేణులకు సూచనలిచ్చారు.

శ్రీవాణి ట్రస్టు ఆలయాల పరిరక్షణే ధ్యేయం



మాట్లాడుతున్న సమరసతా సేవా ఫౌండేషన్ ఉప ప్రముఖ్ సాయిరాం

సోమల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): టీటీడీ శ్రీవాణి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయాల పరిరక్షణే ధ్యేయంగా సమరసతా సేవా ఫౌండేషన్ పనిచేస్తుందని ఆ సంస్థ రాష్ట్ర ఉప ప్రముఖ్ సాయిరాం తెలిపారు. శుక్రవారం సోమల మండలం పార్వతీపురంలో రూ. 10 లక్షల ఆర్థిక సాయంతో నిర్మించిన రామాలయాన్ని ఆయన సందర్శించారు. ఆలయంలో గ్రామస్తులతో కలసి ప్రత్యేక పూజలు చేపట్టారు. శ్రీవాణి ట్రస్టు నిధుల వినియోగంపై గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులతో సమీక్షించారు. ఆలయం వద్ద మరింత అభివృద్ధి పనులు జరగడం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డెప్ప, నరసింహారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, సమరసతా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

భువనేశ్వరికి చిరు వ్యాపారుల వినతి



భువనేశ్వరికి జ్ఞాపిక బహూకరిస్తున్న చిరు వ్యాపారులు

కుప్పం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుప్పం పర్యటనలో ఉన్న నారా భువనేశ్వరికి స్థానిక చిరు వ్యాపారులు తమ సమస్యలు విన్నవించారు. జ్ఞాపిక బహూకరించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చిరు వ్యాపారస్తుల సంఘం అధ్యక్షుడు ఎం.మంజునాథ్, బాబు, సురేష్, మతిన్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు



కాలువల వద్ద మట్టిని తొలగిస్తున్న పోలీసులు

బైరెడ్డిపల్లె, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కనపల్లె గ్రామంలో సంత గేటు సమీపంలో ప్రభుత్వ స్థలం ఆక్రమించుకుంటున్నారని.. ప్రశ్నిస్తే గొడవ పడుతున్నారని టీడీపీ వర్గీయులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. శనివారం కాలువలు ఉన్న చోట కొందరు మట్టిని తోలి చదును చేయడంతో కాలువలు పూడిపోయి ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని.. వెంటనే తొలగించాలని టీడీపీ నాయకులు పట్టుబట్టారు. దీంతో కొంతసేపు వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య వాగ్వాదం జరిగింది. బైరెడ్డిపల్లె పోలీసులు చేరుకొని కాలువల వద్ద తోలిన మట్టిని తొలగించడంతో వివాదం సద్దుమణిగింది.

కార్గో డోర్ డెలివరీ సద్వినియోగం చేసుకోవాలి



ప్రచార వారోత్సవాలు ప్రారంభిస్తున్న అధికారులు, సిబ్బంది

కుప్పం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీ కుప్పం డిపో అందిస్తున్న కార్గో డోర్ డెలివరీ సదుపాయాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని డిపో మేనేజర్ గోపినాథ్ కోరారు. స్థానిక డిపోలో ఆర్టీసీ డోర్ డెలివరీ ప్రచార వారోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. క్రిస్మస్, కొత్త సంవత్సరం, సంక్రాంతి పండుగల సందర్భంగా బంధువులకు, స్నేహితులకు బహుమతులను పంపేందుకు కార్గో డోర్ డెలివరీ సర్వీసును ఉపయోగించుకోవాలన్నారు. చౌక ధరల్లో నాణ్యమైన సేవలు అందించడం ఆర్టీసీ ప్రత్యేకతని తెలిపారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



నీటి నిల్వలను తొలగిస్తున్న అధికారులు

గంగవరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): డెంగీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్ సూచించారు. కలగటూరులో డెంగీ కేసు నమోదవడంపై ఆయన గ్రామంలో పర్యటించారు. నీటి నిల్వలు, మురుగు నిల్వలను పరిశీలించి తొలగించారు. వైద్య, సచివాలయ సిబ్బంది సమన్వయంతో గ్రామంలో ఫాగింగ్, బ్లీచింగ్ చల్లడం వంటి కార్యక్రమాలు చేపట్టి అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి జయశంకర్, సూపర్‌వైజర్ జ్యోతీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పత్ర కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న రాజేందరావ్

కుప్పం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి):గుండ్లమడుగు గ్రామంలో నారా భువనేశ్వరి శుక్రవారం పర్యటించినపుడు స్థానిక సర్పంచ్ రాజేందరాన్ పత్ర కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. అంతకు ముందు కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ రాక్షస పాలనను ఎదిరించి రాజేందరాన్ విజయం సాధించారని.. రూరల్ మండలంలోని పత్ర కులస్తులను ఏకం చేయడంలో చాలా కష్టపడ్డారన్నారు. ఆయనతో పాటు వార్డు సభ్యులను ప్రశంసించారు. పత్ర కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ విషయమై త్వరలోనే నిర్ణయం తీసుకుంటారని భువనేశ్వరి హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు.

ఆలిండియా ఫుట్‌బాల్ టోర్నీకి కేఈసీ విద్యార్థులు



కుప్పం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాలికట్ యూనివర్శిటీలో శుక్రవారం జరగబోయే ఆలిండియా ఇంటర్ వర్శిటీ ఫుట్‌బాల్ మెన్స్ టోర్నీకి అనంతపురం జేఎన్‌టీయూ తరపున 15 మంది విద్యార్థుల బృందం శుక్రవారం బయలుదేరి వెళ్లింది. ఇందులో కుప్పం ఇంజినీరింగ్ కళాశాల (కేఈసీ)లో సీఎస్ఈ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు శ్రీహరి, సీఎస్ఎం విభాగం రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి డెరీన్ డెవిస్‌లు ఉన్నారు. వీరిని బీసీఎస్ విద్యా సంస్థల ఛైర్మన్ బీసీ.నాగరాజ్, కేఈసీ వైస్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.సునీల్‌రాజ్, సీఈవో సాగర్ రాజ్‌లతోపాటు ప్రిన్సిపల్ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, ఫిజికల్ డైరెక్టర్ సి.సతీష్ కుమార్, పీఆర్వో ప్రవీణ్‌కుమార్ తదితరులు అభినందించారు. విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల భవనాలు.. నిరుపయోగం..!

● రూ.కోట్ల ప్రజాధనం వృథా ● పట్టించుకోని అధికారులు



జంగాలపల్లిలో వృథాగా పాఠశాల భవనాలు



బొమ్మిదొడ్డిలో నిరుపయోగంగా ఉన్న పాఠశాల భవనాలు



పకీరుపల్లిలో....

పలమనేరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల అలక్ష్యం కారణంగా పలమనేరు మండలంలో దాదాపు కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన పాఠశాల భవనాలు వృథాగా నిరుపయోగంగా ఉన్నాయి. సుమారు నాలుగేళ్ల క్రితం పాఠశాలల రేషనలైజేషన్‌తో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న నెపంతో మండలంలోని బొమ్మిదొడ్డి, జంగాలపల్లి, పకీరుపల్లి, బేరుపల్లి, రామాపురం, వెంకటేషపురం గ్రామాల్లోని పాఠశాలలను మూసేశారు. విద్యార్థులను పక్క గ్రామాల్లోని పాఠశాలలకు పంపి అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయ పోస్టులు సైతం రద్దుకావడంతో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను మండలంలోని అవసరమున్న పాఠశాలలకు బదిలీ చేశారు. దీంతో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనాలు వృథాగా వదిలేశారు. భవనాలను గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. గత వైసీపీ ప్రభుత్వం మండలంలో పలు గ్రామ, వార్డు సచివాలయాలు, అర్బన్, రూరల్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వాటికి పలుచోట్ల నూతన భవనాలు నిర్మించింది. భవనాలు లేని చోట్ల అద్దె భవనాలు తీసుకొంది. అయితే భవనాలను మండల స్థాయి అధికారులు పట్టించుకోకపోవడంతో నేటికీ వృథాగా ఉన్నాయి. పాఠశాల ఆవరణలు చీకటి కార్యకలాపాలకు నిలయంగా మారడంతో పాటు పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. కేవలం పలమనేరు మండలంలోనే కాదు.. నియోజకవర్గంలోని గంగవరం, బైరెడ్డిపల్లి, వి.కోట, పెద్దపంజాణి మండలాల్లోనూ ఇలాంటి పాఠశాలల మూత కారణంగా భవనాలు వృథాగా ఉండటం గమనార్హం. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో దాదాపు 200లకు పైగా పాఠశాల భవనాలు వృథాగా ఉన్నట్లు సమాచారం. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రెవెన్యూ సదస్సుల్లో అర్జీలకు తక్షణ పరిష్కారం



శ్రీరంగరాజపురంలో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో భవాని

పలమనేరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతుల రెవెన్యూ, రీసర్వే సమస్యలను పరిష్కరిస్తామని పలమనేరు ఆర్డీవో పి.భవాని అన్నారు. శుక్రవారం పలమనేరు మండలం శ్రీరంగరాజపురం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆర్డీవో పి.భవాని హాజరై మాట్లాడారు. సదస్సులను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో పలమనేరు తహసీల్దారు ఇన్బనాథన్, పలు శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

●సోమల: గతంలో ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని.. ప్రస్తుతం ప్రభుత్వ అధికారులే గ్రామాలకు వస్తున్నారని జిల్లా సర్పంచుల సంఘం మాజీ సహాయ కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు అన్నారు. శుక్రవారం ఇరికిపెంట సచివాలయం ఆవరణలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా 22ఏ నిషేధిత భూముల జాబితాలో తొలగింపులు చేపట్టాలని, రైతుల పాసుపుస్తకాల్లో పొరపాట్లు సరిదిద్దాలని, డీకేటీ భూముల సమస్యలు పరిష్కరించాలని వినతులు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు ఇబ్రహీం, మండల సర్వేయర్ షాన్‌వాజ్, కార్యదర్శి మేనక, టీడీపీ నాయకులు కోటేశ్వరరావు, గల్లా బోస్, మోహన్‌నాయుడు, గౌతం, భానుప్రకాష్ నాయుడు, పీఎం చంద్రశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

●రొంపిచెర్ల: రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పెద్దమల్లెల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు భూసమస్యలపై వినతులు అందించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ డీటీ లోకేష్, సర్వేయర్లు ద్వారక, పల్లవి, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి సిబ్యాల రమణ పాల్గొన్నారు.

●పుంగనూరు రూరల్: మండలంలోని గుడిసిబండలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి తహసీల్దారు రాము 20 వినతులు స్వీకరించారు. మండల సర్వేయర్ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు రెడ్డెప్పయాదవ్, రమణయాదవ్, నాగరాజ పాల్గొన్నారు.

●చౌడేపల్లె: రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీటీ మాధవి పేర్కొన్నారు. శుక్రవారం దిగువపల్లె పంచాయతీలో జరిగిన రెవెన్యూ సదస్సులో భూసమస్యలపై 101 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో బోయకొండ ఆలయ ఈవో ఏకాంబరం, మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, టీడీపీ నాయకులు శివన్న, రెడ్డి, బాలాజీ, డీటీ భారతి, సర్వేయర్లు గుణశేఖర్, మురళీ, వీఆర్‌వోలు పాల్గొన్నారు.



పెద్దకురబలపల్లెలో సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో శ్రీనివాసరాజు

●రామకుప్పం:సమస్యలతో సతమతమవుతున్న రైతుల సమస్యలకు పరిష్కారం చూపడానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని కుప్పం ఆర్డీవో శ్రీనివాసరాజు, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాగభూషణం తెలిపారు. శనివారం రామకుప్పం మండలం పెద్దకురబలపల్లెలో జరిగిన సదస్సులో ఆర్డీవో రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దారు బాబు, ఆర్ఐ నారాయణప్ప, నేతలు ఎర్రప్ప, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విరూపాక్షమ్మ ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో అమ్మవారు

కల్లూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దిగుమూర్తివారిపల్లిలో వెలసిన విరూపాక్షమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఆలయ వార్షికోత్సవం వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం గంగస్వీకరణ, కలశ పూజ, అభిషేకాలు, కుంకుమార్చన, హోమం, విశేష పూజలు చేపట్టారు. అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. ఆలయ ధర్మకర్త గురుస్వామి, అర్చకులు పణిప్రకాష్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను విమర్శించడం సరికాదు

పుంగనూరు రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా విమర్శించడం సరికాదని దళిత, కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పుంగనూరు- మదనపల్లె రహదారిపై నిలబడి కేంద్ర మంత్రి అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారిణి గౌతమి, అశోక్‌కుమార్, శ్రీనివాసులు, మహానంది, చంద్ర, సుమిత్ర రమణ, శేషాద్రి, ఆంజప్ప, రెడ్డెప్ప, కాంగ్రెస్ నాయకులు అయూబ్‌ఖాన్, మహ్మద్, నూర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

గంగవరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గంగవరం మండల పరిధిలోని చిన్నమ నాయినిపల్లె రోడ్డు పనులకు రూ.80 లక్షలతో శుక్రవారం టీడీపీ నాయకులు పనులను ప్రారంభించారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న రోడ్డుకు ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించడంతోపాటు ఇచ్చిన హామీని నెరవేర్చినందుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. టీడీపీ మండల అధ్యక్షులు సోమశేఖర్‌గౌడు, వెంకటరమణారెడ్డి, శ్రీనివాసులు, శీనప్ప, తిరుమలయ్య, నాగరాజు, సుబ్రహ్మణ్యం, వెంకటరమణ, గంగాధర్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు

చౌడేపల్లె, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. రాహుకాలంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేపట్టారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు రాహుకాల పూజలో పాల్గొన్నారు.

నాగభూషణరావుకు ఘన సన్మానం



వక్కంతం నాగభూషణరావును సన్మానిస్తున్న హిందువులు

పుంగనూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు శ్రీకళ్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో 18 రోజులపాటు గీతాజయంతి ప్రవచనాలు తెలియజేసిన వక్కంతం నాగభూషణరావును పలువురు ఘనంగా సన్మానించారు. శుక్రవారం రాత్రి ప్రవచనాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసులు, బరిణేపల్లి వేదానందస్వామి, అగ్రహారం ఆశ్రమ నిర్వాహకురాలు పారిజాతమ్మ, టీపీఎస్.నాగరాజ, హిందూ సత్యధర్మ దివ్యజ్ఞానజ్యోతి వ్యవస్థాపకులు ఎం.వెంకటేశ్, భద్రయ్య, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పలమనేరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని విద్యుత్ ఉపకేంద్రంలో ఈనెల 21న శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏడీఈ చిన్నబ్బ తెలిపారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపు దల చేస్తున్నామని పేర్కొన్నారు. పలమనేరు టౌన్, పలమనేరు రూరల్, గంగవరం, బైరెడ్డిపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వడ్డె ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలి

వి.కోట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వడ్డెర వీరుడు వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని ఎండీహెచ్ సంస్థ వ్యవస్థాపకులు పవన్‌కళ్యాన్ రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితకు వినతి పత్రం అందించారు. శుక్రవారం విజయవాడలో మంత్రిని కలిసి సత్యపాల్ కమిటీ సిఫార్సును అమలు చేసి వడ్డెరలను ఎస్టీల జాబితాలో చేర్చాలని కోరారు. వడ్డెర నాయకులు భానుప్రకాష్, నారాయణ, రాజేంద్ర పాల్గొన్నారు.

30న మాలల మహాగర్జన విజయవంతం చేయండి

పుంగనూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30న పుంగనూరు బీఎంఎస్ క్లబ్ ఆవరణలో నిర్వహించే మాలల మహాగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారిణి గౌతమి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో చలో పుంగనూరు కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ఆమోదించాల్సి ఉందన్నారు. ఆర్టికల్ 341 ప్రకారం కులగణన జరిగిన తర్వాతనే ఎస్సీ వర్గీకరణకు అవకాశం ఉందన్నారు. మహాగర్జనలో ఎస్సీ వర్గీకరణపై చర్చించడం జరుగుతుందని వివరించారు. నియోజకవర్గంలోని మాల కులస్తులు, మేధావులు, విద్యార్థులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘనాయకులు అశోక్‌కుమార్, శ్రీనివాసులు, మహానంది, చంద్ర, సుమిత్ర రమణ, శేషాద్రి, ఆంజప్ప, రెడ్డెప్ప పాల్గొన్నారు.

ఘనంగా భారతీయ అంబేడ్కర్ సేన వార్షికోత్సవం

వి.కోట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భారతీయ అంబేడ్కర్ సేన 13వ వార్షికోత్సవాన్ని వి.కోటలో రాష్ట్ర కన్వీనర్ గణపతి నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వి.కోట పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో వ్యవస్థాపక అధ్యక్షులు పీటీఎం శివప్రసాద్ పిలుపు మేరకు భారీ కేక్ కోసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వినోద్‌కుమార్, నేతలు గోపి, రాజగోపాల్, బాబు, అశ్వత్థనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరి పర్యటన విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రామచంద్రనాయుడు

వి.కోట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వి.కోట వ్యవసాయ మార్కెట్ యార్డులో హెరిటేజ్ సజల నీటి ప్లాంట్‌ను 22న ఆదివారం ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి చేతుల మీదుగా ప్రారంభించనున్నారని ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు తెలిపారు. శుక్రవారం మార్కెట్ యార్డులోని కార్యాలయంలో మండల స్థాయి నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. భువనేశ్వరి పర్యటనకు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, మండల తెలుగు యువత అధ్యక్షులు ధీరజ్, జిల్లా అధికార ప్రతినిధి రాంబాబు, చౌడప్ప, నేతలు సుబ్బన్న, చంద్రశేఖర్‌రెడ్డి, గుణ, సతీష్‌నాయుడు, హరినాథరెడ్డి, నారాయణస్వామి, జనార్దన్‌రెడ్డి, భక్తా, షణ్ముగం, కుమార్, సతీష్, విశ్వనాథ్, నాసీర్, వెంకట్రామప్ప, రాము పాల్గొన్నారు.

కుప్పం ప్రభుత్వాసుపత్రి తనిఖీ



కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఫార్మసీలోని మందులు తనిఖీ చేస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని అన్ని వార్డులను పరిశీలించి వైద్యసేవలు సరిగా అందుతున్నాయో లేదో రోగులను ఆరా తీశారు. ఫార్మసీలోని మందులను తనిఖీ చేశారు. అందులో కొన్ని కాలం తీరిన మందులను గుర్తించి ఫార్మసీ అధికారులను మందలించారు. అటువంటి వాటివల్ల రోగులకు ప్రమాదం జరుగుతుందని, వాటిని వెంటనే తీసివేయాలని ఆదేశించారు. మళ్లీ ఇటువంటివి జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులకు అత్యవసరమైన మందులను ఆస్పత్రి అభివృద్ధి నిధి నుంచి కొనుగోలు చేయాలని సూచించారు.

రామకుప్పం పోలీస్‌స్టేషన్ పరిశీలన

రామకుప్పం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మణికంఠ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు కేసులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. నేరాల నిరోధం, కేసుల దర్యాప్తు తీరును ఆయన తెలుసుకుని పలు సూచనలు అందించారు. కుప్పం డీఎస్పీ పార్థసారథి, గ్రామీణ సీఐ మల్లేష్‌యాదవ్, ఎస్ఐ వెంకటమోహన్ పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

పలమనేరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో 21న ఉదయం 11 గంటలకు మున్సిపల్ భవనంలో సాధారణ సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎం.వి.రమణారెడ్డి తెలిపారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

వన మహోత్సవాన్ని జయప్రదం చేయాలి

బైరెడ్డిపల్లె, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఈడిగ గౌడ్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 22న ఆదివారం బంగారుపాళ్యం సమీపంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద జరిగే వనమహోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఈడిగ గౌడ్ సంఘం మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్ ఒక ప్రకటనలో కోరారు. కార్యక్రమంలో ఈడిగగౌడ్ కులస్తులు, సంఘం సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శాంతియుతంగా వివాదాల పరిష్కారం

సోమల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న భూసమస్యల పరిష్కారానికి ఇరువర్గాల వారు శాంతియుతంగా పరిష్కరించుకోవాలని పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్ తెలిపారు. శుక్రవారం కందూరు పంచాయతీ ఉలవలవానికుంటలో ఇరువర్గాల ఫిర్యాదులతో పోలీసులు క్షేత్రస్థాయిలో రాజీ ప్రయత్నం చేశారు. ఇరువర్గాలతో భూ సమస్యను పరిశీలించారు. శాంతియుతంగా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ఎస్ఐ శివశంకర్, పోలీసులు పాల్గొన్నారు.

నేడు మామిడి రైతులకు అవగాహన సదస్సు

రొంపిచెర్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగచింత పంచాయతీ కల్లావారిపల్లెలో శనివారం మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తారని ఉద్యాన అధికారిణి సంతోషికుమారి తెలిపారు. సదస్సులో జిల్లా ఉద్యానాధికారి మధుసూదనరెడ్డి, శాస్త్రవేత్తలు రామయ్య, జ్యోతి రైతులకు తగిన సూచనలు, సలహాలు అందిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గౌరవ వేతనాన్ని బ్యాంకు ఖాతాల్లోకి వేయాలి

పుంగనూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మసీదులోని ఇమామ్, మౌజన్‌లకు ప్రభుత్వం అందజేసే గౌరవ వేతనాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి వేయాలని బీజేపీ రాష్ట్ర మైనారిటీ మోర్చా నాయకుడు పి.అయూబ్‌ఖాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మసీదు కమిటీలు ప్రతినెలా ఇమామ్, మౌజన్లకు వేతనాలు ఇస్తున్నారని, పలుచోట్ల గౌరవ వేతనం ఇవ్వకుండా కమిటీ వారే వాడుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఇమామ్, మౌజన్ల బ్యాంకు ఖాతాలకు వేతనాలు జమ చేయాలని ఆయన కోరారు.

విద్యార్థులకు లడ్డూల పంపిణీ

రొంపిచెర్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలంలోని అన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థులకు లడ్డూలు అందించారు. పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా ఆటో యూనియన్ నాయకుడు ద్వారక, ఆలయ కమిటీ అధ్యక్షుడు సుధాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాల విద్యార్థులకు 5 వేల లడ్డూలు పంపిణీ చేశారు.

ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

పుంగనూరు రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై వాహనాలు నడపాలంటే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పుంగనూరు సీఐ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం సాయంత్రం డాన్‌బాస్కో పాఠశాల సమీపంలో వాహనాలు తనిఖీ చేశారు. మద్యం సేవించిన ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేసి, హెల్మెట్ ధరించని 22 మందిని గుర్తించి జరిమానాలు విధించినట్లు తెలిపారు. హెల్మెట్ లేకుండా రెండోసారి తనిఖీలో పట్టుబడితే లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

కానిస్టేబుల్ కుటుంబానికి సాయం



వళ్లియమ్మకు చెక్కును ఇస్తున్న ఏఎస్పీ రాజశేఖర్‌రాజు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): విజయపురం పోలీసు స్టేషన్‌లో విధి నిర్వహణలో ఉంటూ అనారోగ్యంతో ఈ నెల 7వ తేదీన మృతి చెందిన పోలీసు కానిస్టేబుల్ తంగ రాజు భార్య వళ్లియమ్మకు ఏఎస్పీ రాజశేఖర్‌రాజు ఆర్థికసాయాన్ని అందించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మృతుడి భార్యకు విడో ఫండ్ కింద రూ.50వేలు, ఫ్లాగ్‌ఫండ్ నుంచి రూ.25వేలకు సంబంధించిన చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోలీసుశాఖ తరపున అందాల్సిన అన్ని సౌకర్యాలను సకాలంలో అందిస్తామని మృతుడు భార్య వళ్లియమ్మకు హామి ఇచ్చారు. కార్యక్రమంలో పోలీసు కార్యాలయ బి-సెక్షన్ సూపరింటెండెట్ పార్థసారథి నాయుడు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ నాగేంద్ర

చిత్తూరు అర్బన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపీ) నాగేంద్ర హెచ్చరించారు. శుక్రవారం నగరపాలక కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ సెక్రటరీలు, లైసెన్స్‌డ్ ఇంజనీర్లతో సమావేశాన్ని నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించి లక్ష్యాలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే అక్రమ కట్టడాలను టౌన్‌ప్లానింగ్ సెక్రటరీలు వార్డుల్లో పర్యటించి గుర్తించి ఆపడమే కాకుండా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అక్రమ కట్టడాలు, రోడ్ల ఆక్రమణలతో పాటు మున్సిపల్ స్థలాలు ఎక్కడైనా ఆక్రమణలకు గురైతే సంబంధిత సెక్రటరీలపై చర్యలు తప్పవన్నారు. టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు సక్రమంగా విధులు నిర్వహించాలని చెప్పారు. ఈ సమావేశంలో టీపీవో శుభప్రద, సర్వేయర్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా అమ్మవారికి సుమంగళి పూజ



సుమంగళి పూజలో పాల్గొన్న భక్తులు

వెదురుకుప్పం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కొల్లాగుంట మేల్ మరువత్తూరు ఆదిపరాశక్తి సిద్ధుల పీఠం ప్రార్థనా పూజా మందిరంలో శుక్రవారం రాత్రి శాస్త్రోక్తంగా అమ్మవారికి సుమంగళి పూజ, ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు వీటీ హేమలత, ఎస్.గోవిందరాజులు, ఎం.గోవిందన్, మహేశ్వరి, ఎం.రంగన్, లత, సి.పయణి, జయంతి, కార్యనిర్వాహకులు పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి వరదరాజులు, భారతి దంపతుల వితరణతో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

అన్నదానానికి రూ.రెండు లక్షల విరాళం



చెక్కును విరాళంగా అందిస్తున్న దాత చంద్రారెడ్డి - విరాళం అందించిన పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాణిపాకం ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి రూ.రెండు లక్షల విరాళం వచ్చినట్లు ఏఈవో రవీంద్రబాబు శుక్రవారం తెలిపారు. హైదరాబాదుకు చెందిన చంద్రారెడ్డి రూ.1,00,116 చెక్కు రూపంలో అందించగా, విజయవాడకు చెందిన చల్లాశివా, మీనాక్షి రూ.1,00,116 విరాళంగా అందించారని ఏఈవో తెలిపారు. దాతలకు దర్శన భాగ్యం కల్పించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీ నాయుడు, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ షేక్ అసీఫ్

బంగారుపాళ్యం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం ప్రాంతీయ పశువైద్యశాలలో శుక్రవారం నిర్వహించిన పెంపుడు కుక్కల ఉచిత వైద్య శిబిరాన్ని సహాయ సంచాలకులు డాక్టర్ షేక్ అసీఫ్, డాక్టర్ పి.విజయ్‌మోహన్ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పెంపుడు కుక్కల యాజమాన్య పద్ధతులు, వాటికి సకాలంలో వేయాల్సిన టీకాలపై యజమానులకు అవగాహన కల్పించారు. ఈ శిబిరానికి మండల పరిసర గ్రామాల నుంచి 17రకాల బ్రీడ్స్‌కు చెందిన సుమారు 110 పెంపుడు కుక్కలు వచ్చాయి. వీటిని పరీక్షించి ఉచితంగా నట్టల నివారణ, రేబిస్ వ్యాధి నిర్మూలన టీకాలు వేశారు.

చిత్తూరులో వినోద్‌కుమార్



చిత్తూరు మిత్రులతో వినోద్‌కుమార్

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు వినోద్ కుమార్ శుక్రవారం చిత్తూరులోని తన స్నేహితులతో సందడి చేశారు. బెంగళూరు నుంచి విజయవాడ వెళ్తూ మార్గమధ్యంలో నగర శివారులోని ఇరువారంలోని ఓ టీ స్టాల్ వద్ద చిరకాల మిత్రులైన సాగర్ చికెన్ చిట్టిబాబు, జనార్ధన్, దినేష్‌కుమార్‌లతో మాట్లాడారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్, చరణ్‌రాజ్‌తో కలిసి ఓ చిత్రాన్ని నిర్మించనున్నట్లు చిట్టిబాబు తెలియజేశారు.

సారా కేసులో ఒకరి అరెస్టు

వెదురుకుప్పం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం యనమలమందలో సారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐ పి.జవహర్‌బాబు శుక్రవారం తెలిపారు. చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంటు, కార్వేటినగరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా వెదురుకుప్పం మండలంలో దాడులు నిర్వహించామన్నారు. యనమలమందలో ఎం.రఘు ఇంట్లో పది లీటర్ల సారాను గుర్తించి, సారా స్వాధీనం చేసుకుని అతడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ గ్రామ శివార్లలో సారా స్థావరాలపై దాడులు జరిపి 1200 లీటర్ల సారా ఊటను, 20 లీటర్ల సారాను ధ్వంసం చేశామని చెప్పారు. ఈ విషయమై కార్వేటినగరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

మద్యం సేవించి బైక్ నడిపినందుకు జరిమానా

యాదమరి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడిపిన వ్యక్తికి కోర్టు రూ.10వేలు జరిమానా విధించింది. ఎస్‌ఐ ఈశ్వర్ శుక్రవారం యాదమరిలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా తమిళనాడు రాష్ట్రం గుడియాత్తంకు చెందిన యువనేష్ మద్యం తాగినట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. రెండవ సివిల్ జడ్జి కోర్టు ముందు ప్రవేశపెట్టగా రూ.10వేలు జరిమానా విధించారు. ఎస్‌ఐ మీడియాతో మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలను నడిపితే కేసులు నమోదుచేసి జరిమానాలు విధిస్తామని తెలిపారు.

సౌత్ జోన్ టోర్నమెంట్‌కు ఎంపికైన విద్యార్థినులు



విద్యార్థినులను అభినందిస్తున్న అధ్యాపకులు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ క్రీడలకు స్థానిక ఎస్‌పీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మనోహర్ తెలిపారు. ఎస్వీయూ తరపున ఈనెల 27న కాలికట్‌లో జరిగే ఖోఖో పోటీల్లో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న హేమలత, హాకీ పోటీలకు ద్వితీయ బీకాం చదువుతున్న సంధ్య పాల్గొంటారని తెలిపారు. వీరిని అధ్యాపకులు అభినందించారు.

కుప్పం ప్రభుత్వాసుపత్రి తనిఖీ



కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఫార్మసీలోని మందులు తనిఖీ చేస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని అన్ని వార్డులను పరిశీలించి వైద్యసేవలు సరిగా అందుతున్నాయో లేదో రోగులను ఆరా తీశారు. ఫార్మసీలోని మందులను తనిఖీ చేశారు. అందులో కొన్ని కాలం తీరిన మందులను గుర్తించి ఫార్మసీ అధికారులను మందలించారు. అటువంటి వాటివల్ల రోగులకు ప్రమాదం జరుగుతుందని, వాటిని వెంటనే తీసివేయాలని ఆదేశించారు. మళ్లీ ఇటువంటివి జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. ప్రాంతీయ ఆస్పత్రిలో రోగులకు అత్యవసరమైన మందులను ఆస్పత్రి అభివృద్ధి నిధి నుంచి కొనుగోలు చేయాలని సూచించారు.

ఆయిల్ పామ్ తోటతో అధిక లాభాలు



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

శ్రీరంగరాజపురం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ తోటతో అధిక లాభాలు పొందవచ్చునని జిల్లా హార్టికల్చర్ అధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నెలవాయి గ్రామంలో రైతులకు ఆయిల్ పామ్ తోట పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ వంట నూనెల పంట అని, మార్కెట్‌లో ఎప్పుడూ డిమాండ్ ఉంటుందని చెప్పారు. ప్రతి సంవత్సరం లక్ష కోట్లు ఖర్చు పెట్టి విదేశాల నుంచి 150 లక్షల టన్నుల వంట నూనెలు దిగుమతి చేసుకుంటున్నామని తెలిపారు. ఇతర పంటతో పోలిస్తే వ్యవసాయ కూలీల అవసరం చాలా తక్కువని, ఒక కూలీతో 15-20 ఎకరాలు సాగు చేసుకోవచ్చని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగాధర నెల్లూరు హార్టికల్చర్ అధికారి లోకేష్, సిబ్బంది డిల్లీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మేడాలమ్మ గుడికి ధూప, దీపాలకు సాయం చేయండి

వెదురుకుప్పం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కత్తెరపల్లెలో ఉన్న యాదవ కుల దేవత మేడాలమ్మ గుడికి ప్రభుత్వం నుంచి ధూప, దీప, నైవేద్యానికి సాయం అందించాలని ఆ గ్రామస్తులు శుక్రవారం కోరారు. ప్రభుత్వం నుంచి ఈ ఆలయానికి సాయం అందడం లేదన్నారు. ప్రభుత్వ యంత్రాంగం సానుకూలంగా స్పందించి మేడాలమ్మ గుడికి సాయమందించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

పీసీఆర్ పాఠశాలను ఆనుకుని

పండ్ల మార్కెట్ నిర్మాణం..!

- రద్దీగా ఉండే ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమయ్యే అవకాశం



పీసీఆర్ పాఠశాల ప్రహరీని ఆనుకుని పండ్ల దుకాణాల కోసం వేసిన పునాది

చిత్తూరు అర్బన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా మార్కెట్ లేదా జనం చేరే చోట ట్రాఫిక్‌తో పాటు వాహనాల పార్కింగ్‌కు అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేయాల్సి ఉంది. అయితే చిత్తూరు నగరపాలక అధికారులు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనడానికి నిదర్శనం పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలను ఆనుకుని పండ్ల మార్కెట్ నిర్మాణం చేపట్టడమే. గతంలో పాత బస్టాండు స్థలంలో పండ్ల వ్యాపారులు దుకాణాలను నడుపుతున్నారు. చాలా రోజుల నుంచి ఈ స్థలంలో పెద్దమాల్‌ను నిర్మించాలని నగరపాలకశాఖ చెబుతూ వస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో హైరోడ్డు ఆక్రమణల తొలగింపుతో పాటు పాత బస్టాండులో ఉన్న పండ్ల మార్కెట్‌ను తరలించాలని నగర పాలక అధికారులు నిర్ణయించారు. అంత వరకు బాగానే ఉన్నప్పటికీ ఇక్కడ నుంచి తరలించే వ్యాపారులను తీసుకెళ్లి పీసీఆర్ పాఠశాల, కళాశాల వద్ద పెట్టాలని నిర్ణయించారు. గతంలో ట్రాఫిక్ సమస్యను గుర్తించి పీసీఆర్ పాఠశాల, డీఈవో కార్యాలయ స్థలాలను రోడ్డుకు స్థలం వదిలి లోపలికి ప్రహరీలను నిర్మించుకున్నారు. ట్రాఫిక్ సమస్యను గాలికొదిలేసి ఇప్పటికే పాఠశాల, కళాశాలను ఆనుకుని పండ్ల మార్కెట్ కోసం నిర్మాణాలను చేపట్టారు. విద్యార్థులతో పాటు ఇటు ఎస్టేట్, పుత్తూరు తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో రద్దీగా ఉంటోంది. అలాంటి ప్రాంతంలో పండ్ల మార్కెట్‌ను ఏర్పాటు చేస్తే జనంతో పాటు వాహనాల రద్దీ ఎక్కువై ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమయ్యే అవకాశం ఉంది. పాలకులు, అధికారులు ట్రాఫిక్‌తో పాటు విద్యార్థులు, ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అనువైన ప్రాంతంలో పండ్ల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చంద్రబాబుది అభివృద్ధి విజన్ - జగన్‌ది దోపిడీ విజన్

- టీడీపీ నేతలు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుది అభివృద్ధి విజన్ అని, మాజీ సీఎం జగన్‌ది దోపిడీ విజన్ అని టీడీపీ నేతలు అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబుపైన, కూటమి ప్రభుత్వంపైన వైసీపీ సమావేశంలో జగన్ చేసిన ఆరోపణలన్నీ అవాస్తవమని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం అమలవుతోందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాల అమలు ప్రారంభమైందని తెలిపారు. జగన్ పాలన మొత్తం ఇసుక, మద్యం, గనులు, పేదల రేషన్ బియ్యం, భూములు, ఇళ్ల స్థలాల్లో అవినీతి, కుంభకోణాలతోనే సాగిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే కుంభకోణాలు జరిగాయంటూ జగన్ నిరాధార ఆరోపణలు చేయడం దారుణమన్నారు. జగన్ తన పార్టీ క్యాడర్‌ను నిలబెట్టుకోవడం కోసం నానా తంటాలు పడుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు సురేంద్రకుమార్, సప్తగిరి ప్రసాద్, నేతలు మోహన్‌రాజ్, ధరణి, గోపాల్, సురేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

- ఉన్నట్టుండి రోడ్డుపై పడ్డ చెట్టు



నడిరోడ్డులో పడి చెట్టు



నలిగిపోయిన ద్విచక్ర వాహనం

చిత్తూరు అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-తిరుపతి రోడ్డులోని విష్ణుభవన్ హోటల్ ఎదురుగా ఉన్న వేపచెట్టు ఉన్నట్టుండి పడిపోయింది. పెద్ద శబ్దంతో మెల్లగా వాలిపోవడంతో కింద ఉన్న వారంతా పరుగులు తీయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రోడ్డుకు పక్కనే 30 ఏళ్ల వేపచెట్టు ఉంది. రోడ్డుకు పలు దఫాలుగా తారు వేయడంతో చెట్టు వేర్లలోని పటుత్వాన్ని కోల్పోయింది. దాంతో ఏటవాలుగా ఉన్న చెట్టుకు ఒకేవైపు బరువురావడంతో శుక్రవారం ఉన్నట్టుండి పడిపోయింది. పెద్ద శబ్దంతో చెట్టు కొమ్మలు విరిగిపడటంతో కిందఉన్న దుకాణదారులు, హోటల్‌కువచ్చిన వారంతా పరుగులు తీశారు. చెట్టు కింద ఉన్న రెండు ద్విచక్రవాహనాలు, రెండు తోపుడు బండ్లు నలిగిపోగా ఒక వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. స్పందించిన టౌన్ ప్లానింగ్ ఏసీపీ నాగేంద్ర అక్కడకు చేరుకుని పడిపోయిన చెట్టును సకాలంలో కట్టర్లతో కట్ చేసి ట్రాఫిక్‌కు ఇబ్బందుల్లేకుండా చేశారు.

ప్రభుత్వ పథకాలను

సద్వినియోగం చేసుకోండి

- మహిళలకు ట్రైనీ కలెక్టర్ హిమవంశి సూచన



చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ట్రైనీ కలెక్టర్ హిమవంశి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్డీఏ సమావేశ మందిరంలో జిల్లా సమాఖ్య వార్షిక మహాసభ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సాధికారిత అభివృద్ధికి డీఆర్డీఏ ముఖ్యపాత్ర పోషిస్తోందని చెప్పారు. స్వయం సహాయక సంఘాల మహిళలు స్వయం ఉపాధిలో భాగంగా వ్యాపారాల నిమిత్తం బ్యాంకుల ద్వారా రుణాలు పొంది అభివృద్ధి సాధించాలన్నారు. రుణాలను బ్యాంకులకు సకాలంలో చెల్లిస్తే, ఆ తర్వాత మరిన్ని రుణాలను బ్యాంకులు అందజేస్తాయని అన్నారు. డీఆర్డీఏ ఇన్‌చార్జి పీడీ శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి మండలంలోని సమాఖ్య మహిళలు కలసికట్టుగా పనిచేసి అభివృద్ధికి కృషిచేయాలన్నారు. ఏపీడీ రవికుమార్, డీపీఎం రవికుమార్, ఏపీఎంలు మధు, సుబ్బారెడ్డి, అరుణ, జ్యోతి, హేమ తదితరులు పాల్గొన్నారు.

ద్రౌపది అమ్మవారికి ప్రత్యేక పూజలు



వెదురుకుప్పం, డిసెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): కార్వేటినగరంలోని ద్రౌపది అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

గంగమ్మను దర్శించుకున్న ఓం శక్తి భక్తులు

కార్వేటినగరం మండలం కేశవకుప్పం శివారులో ఉన్న బొల్లికొండ గంగమ్మను శుక్రవారం ఓంశక్తి భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఓం శక్తి భక్తులతో ఇక్కడ సందడి ఏర్పడింది.

రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తాం



కార్వేటినగరం మండలం ఎర్రమరాజుపల్లిలో వినతిపత్రాన్ని తీసుకుంటున్న తహసీల్దార్ నాగరాజు

వెదురుకుప్పం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు కార్వేటినగరం తహసీల్దార్ నాగరాజు తెలిపారు. శుక్రవారం కార్వేటినగరం మండలంలోని ఎర్రమరాజుపల్లిలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎనిమిది వినతిపత్రాలను తహసీల్దార్ తీసుకున్నారు.

బంగారుపాళ్యం: భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని తుంబకుప్పంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 18 వినతి పత్రాలు వచ్చినట్లు తహశీల్దార్ పేర్కొన్నారు. ఎంపీపీ అమరావతి, ఆర్‌ఐ మధుసూదన్, సర్వేయర్ లావణ్య పాల్గొన్నారు.

పాలసముద్రం: రైతులకు రీ సర్వే సందర్భంగా జరిగిన అవకతవకలను సరిదిద్దడానికే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. మండలంలోని కోదండరామాపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించి, రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆర్‌ఐ దేవి, సర్వేయర్ గణేష్, వీఆర్వో రమేష్ నాయుడు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ లోకనాథం పిళ్లై తెలిపారు. విలాసవరహపురంలో జరిగిన రెవెన్యూ సదస్సులో 15 అర్జీలు వచ్చేయని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ రవీంద్ర బాబు, టీడీపీ సీనియర్ నేత సిద్ధయ్య శెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస దీపారాధనలు



దుర్గాంబ ఆలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): గిరింపేట దుర్గాంబ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి భక్తులు దీపారాధనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ధనుర్మాసం తొలి శుక్రవారం రోజున భక్తులు అమ్మవారికి దీపారాధనలు చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని విశ్వాసం. రాబోయే మరో నాలుగు శుక్రవారాలు క్రమం తప్పకుండా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, దీపారాధనలతో భక్తులు కొలవనున్నారని ఆలయ పర్యవేక్షకులు పంబల్ మణి తెలిపారు.

సారా ఊట ధ్వంసం

చిత్తూరు సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సారా ఊట ధ్వంసం చేసి, మూడు కేసులు నమోదు చేసినట్లు చిత్తూరు ఎక్సైజ్ అర్బన్ సీఐ శ్రీహరి రెడ్డి చెప్పారు. శుక్రవారం గుడిపాల మండలం రాసనపల్లి పరిసర ప్రాంతాలైన పిల్లిగుట్ట, సర్దార్ మిట్ట, ఊటవంక తదితర అటవీ ప్రాంతాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించామని అన్నారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉన్న సుమారు 2500 లీటర్ల సారా ఊటను ధ్వంసంచేసి, మూడు కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. సారా తయారీకి సంబంధించి ముగ్గురు భూ యజమానులపై కేసు నమోదు చేశామని, త్వరలో సారా తయారు చేస్తున్న వారిని గుర్తించి, అరెస్టు చేస్తామని సీఐ శ్రీహరి రెడ్డి చెప్పారు.

ఘనంగా గణిత దినోత్సవం



డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

వెదురుకుప్పం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బి.అన్నపూర్ణశారద మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి పొందిన ఆధునిక గణిత శాస్త్రవేత్తల్లో ఒకరైన శ్రీనివాస రామానుజన్ గురించి, సిద్ధాంతాల గురించి వివరించారు. గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎస్.రుష్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.లక్ష్మిప్రసన్నలత తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

గంగవరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): డెంగీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్ సూచించారు. కలగటూరులో డెంగీ కేసు నమోదవడంపై ఆయన గ్రామంలో పర్యటించారు. నీటి నిల్వలు, మురుగు నిల్వలను పరిశీలించి తొలగింపజేశారు. వైద్య, సచివాలయ సిబ్బంది సమన్వయంతో గ్రామంలో ఫాగింగ్, బ్లీచింగ్ చల్లడం వంటి కార్యక్రమాలు చేపట్టి అప్రమత్తంగా ఉండాలన్నారు. సబ్‌యూనిట్ అధికారి జయశంకర్, సూపర్‌వైజర్ జ్యోతీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.